www.visalaandhra.com

స్థాపితం : 1952

విశాలాంధ్ర

అక్షరాక్షరం అభ్యుదయం

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

బుధవారం 12-06-2024 | విజయవాడ ప్రచురణ | Simultaneously published from Vijayawada, Visakapatnam, Tirupathi, Kurnool, Hyderabad,Karimnagar, Khammam | సంపుటి : 72, సంచిక : 351 పేజీలు : 8, వెల: రూ.5.00

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నవోదయం

అందరికీ స్వాగతం... సుస్వాగతం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నవోదయం



ఆంధ్రప్రదేశ్ ప్రజల కలల సాకారానికి శుభారంభం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎన్డీయే శాసనసభాపక్ష నేత

శ్రీ నారా చంద్రబాబునాయుడు గారి ప్రమాణ స్వీకార మహోత్సవం

తేదీ & సమయం

జూన్ 12, 2024 (బుధవారం), ఉదయం గం. 11:27 ని.లకు

స్థలం

కేసరపల్లి ఐటీ పార్క్ వద్ద, గన్నవరం, కృష్ణా జిల్లా

ముఖ్య అతిథులు

భారత ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ శ్రీ ఎస్. అబ్దుల్ నజీర్ గారు

భారత హోమ్ శాఖామాత్యులు శ్రీ అమిత్ షా గారు

విశిష్ట అతిథులు

బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు శ్రీమతి పురందేశ్వరి గారు

జనసేన అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ గారు

అందరికీ స్వాగతం... సుస్వాగతం

జారీ చేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

ఎన్డీయే విజయానికి... జగన్ వైఫల్యానికి

అమరావతి ఉద్యమమే కీలకం

- ఆ ఉద్యమంలో సీపీఐ కీలక పాత్ర
- సీఎంగా ప్రమాణం చేయనున్న చంద్రబాబుకు శుభాకాంక్షలు
- ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం: ఆంధ్ర రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీల ఎన్డీఏ కూటమి విజయానికి.. జగన్ రెడ్డి వైఫల్యానికి అమరావతి ఉద్యమమే కీలకమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. స్థానిక కొత్తపేటలో ఉన్న మల్లయ్య లింగం భవన్‌లో మంగళవారం విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముప్పాళ్ల మాట్లాడుతూ అమరావతి ఉద్యమంలో సీపీఐ ఆ రోజు నుంచి ఈ రోజు వరకు కీలక పాత్ర పోషించినందుకు గర్వపడుతున్నామన్నారు. ప్రభుత్వ ఆస్తులను తాకట్టుపెట్టి అప్పు చేసి పప్పు కూడు లాగా చేసిన జగన్ రెడ్డి వైఫల్యాలు భవిష్యత్తు పాలకులకు కనువిప్పు కలిగించాయని అన్నారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో గెలిచిన వాళ్లే రాజు అని, ఓడిన వాళ్లు కాలగర్భంలో కలిసిపోతారని అనుకోవడం తప్పని హితవు పలికారు. జగన్ పాశవిక... నియంతృత్వ పాలనకు ప్రజలు తగిన రీతిలో బుద్ధి చెప్పారని అన్నారు. గత ఐదు సంవత్సరాల ప్రజల వ్యతిరేక పాలనా పద్ధతులపై సీపీఐ రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు సాగించినట్లు చెప్పారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో కమ్యూనిస్టులు చట్ట సభలకు వెళ్లలేకపోయినా రాజకీయ మార్పులు... ప్రజాస్వామ్యాన్ని కాపాడటంలో సీపీఐ చేసిన కృషిని ఎవరు అభినందించకుండా ఉండలేరన్నారు. అమరావతి రైతుల త్యాగానికి, అమరావతి వీర మహిళల పోరాటాలు... రాజధాని ఉద్యమం... విశాఖ ఉక్కు ఉద్యమం... కడప స్టీల్ ప్లాంట్ సాధన కోసం... ప్రత్యేక హామీ అంశాల సాధన కోసం సీపీఐ గర్వకారణమైన పోరాటాలు చేసినట్లు ఆయన తెలిపారు. ఆంధ్ర రాష్ట్రంలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థులందరూ వారు చేసిన ప్రమాణం మేరకు రాష్ట్ర పురోభివృద్ధికి కృషి చేయాలని కోరారు. 400 సీట్లు గెలిచి హ్యాట్రిక్ కొడతామన్న నరేంద్ర మోదీ పూర్తిగా వైఫల్యం చెందినట్లు విమర్శించారు. కానీ కాంగ్రెస్ పార్టీ అన్ని రాష్ట్రాలతో పొత్తులు కుదుర్చుకొని ఒకింత కష్టపడినట్లయితే బీజేపీ ప్రభుత్వం ఓటమి చెందేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఒంటెద్దు పోకడలను నిలువరించాల్సిన పరిస్థితి ప్రతిపక్షాలకు ముఖ్యంగా మన రాష్ట్రంలోని ఎన్డీయే కూటమికి ఉందన్నారు. రాజధానిగా అమరావతిని అంగీకరిస్తున్నట్లు సాక్షాత్తు శాసనసభలో చెప్పిన జగన్ రెడ్డి తదనంతరం మూడు రాజధానులు అనే అస్త్రాన్ని తెరపైకి తెచ్చి రాజధాని అమరావతిని విచ్ఛిన్నం చేశాడని ధ్వజమెత్తారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఇండియా ఐక్య సంఘటన బలమైన ప్రతిపక్షంగా ఏర్పడటం శుభపరిణామమని అన్నారు. ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో మౌలిక సదుపాయాలు లేక ఈ రాష్ట్ర ప్రజలు నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారని విమర్శించారు. విద్యుత్ చార్జీలు... చెత్తపై పన్ను... రాజకీయంలో రాకూడని హింసాత్మక ఘటనలు చూడలేక ప్రజలు వైసీపీని ఓడించినట్లు చెప్పారు. ప్రజల ఆకాంక్షలే ఎన్డీయే కూటమికి అత్యధిక మెజారిటీ తెచ్చి పెట్టిందని, ఎన్నికలు సందర్భంగా మ్యానిఫెస్టోలో పెట్టిన అంశాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. కేంద్రంలో కీలకమైన పాత్ర పోషిస్తున్న ఆంధ్ర రాష్ట్ర ఎన్డీయే కూటమి ఇప్పుడైనా ప్రత్యేక హోదా, విభజన హామీలు, రాజధాని అమరావతికి కావలసిన నిధులు, విశాఖలో రైల్వే జోన్, కడపలో స్టీల్ ఫ్యాక్టరీ సాధించేందుకు చంద్రబాబు కృషి చేయాలని హితవు పలికారు. రాజకీయాలలో రాజకీయపరంగా విమర్శలు ఉండాలే తప్ప భౌతిక దాడులకు పాల్పడటం మంచిది కాదని హితవు పలికారు. చంద్రబాబు ఒక సరికొత్త తరహా పాలనను ఈ రాష్ట్ర ప్రజలకు అందించాలని ఆయన ఆకాంక్షించారు. బుధవారం ప్రమాణ స్వీకారం చేయనున్న చంద్రబాబుకు ముప్పాళ్ల నాగేశ్వరరావు, జంగాల అజయ్‌కుమార్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఏరువాకను విజయవంతం చేయాలి

కేవీవీ ప్రసాద్ పిలుపు

విశాలాంధ్ర-ఒంగోలు: ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం అధ్వర్యంలో ఈ నెల 22న జరిగే ఏరువాక పౌర్ణమిని విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఒంగోలు మల్లయ్య లింగయ్య భవనంలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వడ్డే హనుమారెడ్డి అధ్యక్షతన మంగళవారం జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో కేవీవీ ప్రసాద్ మాట్లాడారు. రైతులకు సాగు సాయం కింద ఎకరాకు రు.15 వేలు అందించాలని, వ్యవసాయ యాంత్రీకరణ పనిముట్లు రాయితీపై అందించాలని, డీజిల్, పెట్రోల్ రాయితీపై అందజేయాలని కేవీవీ ప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. ప్రకృతి వ్యవసాయంపై పనిచేసే కార్యకర్తలకు 16 నెలల నుంచి గౌరవ వేతనం అందలేదన్నారు. తక్షణమే నిధులు మంజూరు చేయాలన్నారు. ఏపీ రైతు సంఘం గ్రామ శాఖల ఏర్పాటు, సభ్యత్వ నమోదును త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వీరారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గాల వారీగా కమిటీ సమావేశాలను ఏరువాక పౌర్ణమిలోపే నిర్వహించాలన్నారు. మూడు గ్రామాల్లో తగ్గకుండా గ్రామశాఖలు ఏర్పాటు చేయాలని సూచించారు. హనుమారెడ్డి మాట్లాడుతూ వెలుగొండ, గుండ్లకమ్మ, సంగమేశ్వర ప్రాజెక్టులకు అవసరమైన నిధులు మంజూరు చేసి పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గుండ్లకమ్మ పరివాహక ప్రాంతంలో చీర్వా నుప్పులపాడు, కీర్తిపాడుల చెక్‌డ్యాం పనులు ప్రారంభించాలన్నారు. సమావేశంలో రైతుసంఘం నాయకులు బి.రామయ్య, పీవీ కొండయ్య, జి.బాలిరెడ్డి, లెనిన్, టీవీ శేషయ్య, జి.ప్రసాదు, అంకయ్య, ఆంజనేయులు, సాంబశివరావు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పగలు, ప్రతీకారం వద్దు... ప్రజల కోసం పనిచేద్దాం

జనసేన శాసనసభ పక్ష నేత పవన్ కల్యాణ్

విశాలాంధ్ర-మంగళగిరి: జనసేన శాసనసభ పక్ష నేతగా ఆ పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో జనసేన శాసనసభ పక్ష మొదటి సమావేశం జరిగింది. జనసేన శాసనసభ పక్ష నాయకుడుగా పవన్ కల్యాణ్ పేరును పార్టీ పీఏసీ చైర్మన్, తెనాలి ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ ప్రతిపాదించగా...ఇతర ఎమ్మెల్యేలంతా ఏకగ్రీవంగా బలపర్చారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ 'ప్రజలు అందించిన ఈ ఘన విజయం కక్ష సాధింపు రాజకీయాల కోసం కాదు. పగ, ప్రతీకారాలు తీర్చుకోవడానికి అంతకంటే కాదు. వారు మనల్ని మనస్ఫూర్తిగా నమ్మి అఖండ విజయాన్ని అందించారంటే వారికి అత్యుత్తమ పాలన ఇవ్వాలని చెప్పడమే. నేను ఎప్పుడూ ప్రజాస్వామ్య స్ఫూర్తిని తప్పి ప్రవర్తించలేదు. గత ప్రభుత్వానికి ఇది అర్థం కాలేదు. ప్రజాస్వామ్యాన్ని పూర్తిస్థాయిలో పరిరక్షించే బాధ్యతను తీసుకుందాము' అని అన్నారు. జనసేన పార్టీ విలువలను, స్ఫూర్తిని ముందుకు తీసుకెళ్లడంలో పార్టీ తరపున గెలిచిన ఎమ్మెల్యేలంతా పని చేయాలని సూచించారు. పగలు, ప్రతీకారాలకు సమయం కాదని... దీనిని శ్రేణులకు కూడా అర్థమయ్యేలా నాయకులు తెలియజెప్పాలన్నారు. ప్రజలు జనసేన పార్టీని నమ్మి పెద్ద బాధ్యతను ఇచ్చారని, దానిని సక్రమంగా నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. తనతో గెలిచిన ఎమ్మెల్యేలంతా ప్రజలకు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. మొదట నియోజకవర్గంలో కీలక సమస్యలు, ప్రజలు పడుతున్న ఇబ్బందులు గుర్తించాలని, ఏవి ప్రాధాన్య అంశాలో తెలుసుకుని మొదట వాటి పరిష్కారానికి ప్రాధాన్యం ఇద్దామన్నారు. ఒక వేళ కేంద్రంతో ముడిపడిన అంశాలు ఉంటే కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అవి పూర్తయ్యేలా చొరవ తీసుకుందామని చెప్పారు. పార్టీ తరపున కూడా ప్రత్యేక కమిటీగా ఏర్పడి ప్రజల సమస్యలు తీర్చేందుకు సమన్వయం చేసుకుందామన్నారు. ప్రజలు ఒక్కోసారి కోపంలో ఒక మాట మాట్లాడినా దానిని వేరుగా తీసుకోవద్దని, వారి ఆగ్రహానికి కారణాలు ఏంటో తెలుసుకుని వాటిని పరిష్కరించేలా పని చేయాలని ఆదేశించారు. ప్రజాస్వామ్యంలో విమర్శలు సహేతుకంగా ఉండాలని, వ్యక్తిగతంగా అసలు మాట్లాడకూడ దన్నారు. ఇతర రాజకీయ పార్టీల నేతలు వ్యక్తిగతంగా మాట్లాడినా...దానిని ప్రజాస్వామ్య పద్ధతిలో ఎదుర్కొనాలే తప్పా ఎదుటివారు మాట్లాడారని ఎట్టి పరిస్థితుల్లో పరిధి దాటి మాట్లాడొద్దని పార్టీ శ్రేణులకు తెలిపారు.

నాదెండ్ల మనోహర్ మనోహర్ మాట్లాడుతూ... చారిత్రక విజయం అందుకున్న ఈ తరుణంలో మొదటి శాసనసభ పక్ష సమావేశం జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. పవన్ కల్యాణ్ చిత్తశుద్ధి... రాష్ట్రం కోసం తపించిన విధానం మనల్ని గెలిపించాయన్నారు.

నీట్ మళ్లీ నిర్వహించాలి

ఆర్టీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి/హైదరాబాద్: వైద్య విద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం జాతీయ స్థాయిలో నిర్వహించిన నీట్ (2024) పరీక్షలో అవకతవకల ఆరోపణలున్నాయని, అందువల్ల మళ్లీ నీట్‌ను నిర్వహించాలని ఆర్టీఐ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంటి ముదిరాజ్ డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ నెల 14వ తేదీన రావాల్సిన నీట్ ఫలితాలను ఎన్నికల ఫలితాల రోజున హడావుడిగా విడుదల చేశారని ఆరోపించారు. నీట్‌లో ఆల్ ఇండియా స్థాయిలో 67 మంది ఫస్ట్ ర్యాంక్ సాధించారని, వారిలో మొత్తం 720గాను 719, 718 మార్కులు సాధించారని, నీట్ చరిత్రలో ఇలాంటి ఫలితాలు ఎప్పుడూ రాలేదని తెలిపారు. ఒకే సెంటర్ నుంచి 8 మంది విద్యార్థులు ఆల్ ఇండియా ఫస్ట్ ర్యాంకులు సాధించారని, ప్రవేశ పరీక్ష నిర్వహణలో జరిగిన లోపాలకు ఇదే నిదర్శనమని వివరించారు. సాంకేతిక సమస్యలతో పరీక్షలను ఆలస్యంగా నిర్వహించి, నిర్ణీత సమయంలోనే పరీక్ష ముగించారని, దీంతో సమయం కోల్పోయిన విద్యార్థులు కోర్టును ఆశ్రయించారని గుర్తుచేశారు. హడావిడిగా నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) బాధిత విద్యార్థులకు గ్రేస్ మార్కులు కలుపుతామని ప్రకటించారని, దీనివల్ల ప్రతిభా విద్యార్థులు తీవ్రంగా నష్టపోయారన్నారు. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్న ఎన్‌టీఏపై సీబీఐతో సమగ్ర విచారణకు కేంద్ర ప్రభుత్వం ఆదేశించాలని, లేకుంటే ఆర్టీఐ ఇండియా నేతృత్వంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సూర స్రవంతి, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి చరణ్, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు రాజు, నమిండ్ల హరీశ్, సాదబోయిన రాజు, అక్కెల్లి పవన్ కళ్యాణ్, కార్తీక్, ప్రవీణ్, కిరణ్ పాల్గొన్నారు.

ప్రధాని పర్యటనకు పటిష్ట భద్రత

ఎస్పీజీ ఐజీ నవనీత్ కుమార్

విశాలాంధ్ర బ్యూరో-మచిలీపట్నం: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ కృష్ణాజిల్లా పర్యటన సందర్భంగా పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీజీ ఐజీ నవనీత్‌కుమార్ తెలిపారు. మంగళవారం అధికారులతో కలిసి గన్నవరం మండలం కేసరపల్లి గ్రామం సందర్శించిన అనంతరం ఆయన మాట్లాడుతూ బుధవారం కేసరపల్లి గ్రామంలోని ఐటీ పార్క్ మేధా టవర్స్ సమీపంలో రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయనున్న నేపథ్యంలో ప్రధాని మోదీ పర్యటన ఏర్పాట్లపై గన్నవరం విమానాశ్రయంలో ముందస్తు భద్రత సమన్వయం (ఏఎస్ఎల్) నిర్వహించామని అన్నారు. ప్రధాన మంత్రి కాన్వాయ్ రాకపోకలపై రూట్ మ్యాప్‌ను దర్శించి, ఆ మార్గంలో గన్నవరం విమానాశ్రయం నుంచి ప్రమాణ స్వీకార వేదిక వరకు ట్రయల్ రన్ కాన్వాయ్‌ను నడిపించారు. ప్రధాని రాకపోకలకు ఎటువంటి అంతరాయం లేకుండా పటిష్ట బందోబస్తు చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు హరికిరణ్, డీఐజీ గోపీనాథ్ జెట్టి, కృష్ణాజిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేత సంపత్‌కుమార్ హత్య కేసు

నలుగురు నిందితుల అరెస్టు

విశాలాంధ్ర-ధర్మవరం: సంచలనం సృష్టించిన కాంగ్రెస్ పార్టీ జాతీయ కార్యదర్శి, హిందూపురం న్యాయవాది బిర్రు సంపత్‌కుమార్ హత్య కేసును ధర్మవరం వన్‌టౌన్ పోలీసులు 13రోజుల్లోనే ఛేదించారు. సత్యసాయి జిల్లా ధర్మవరం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ కార్యాలయంలో డీఎస్పీ శ్రీనివాసులు మంగళవారం మీడియాకు కేసు వివరాలు వెల్లడించారు. మే 29వ తేదీన హిందూపూర్ పరిసర ప్రాంతాల్లో సంపత్ కుమార్‌ని హత్య చేసి, శవాన్ని కారులో డిక్కీలో తీసుకుని వచ్చి ధర్మవరం చెరువు వద్ద పడవేశారని... కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఈనెల 11వ తేదీ ఉదయం కనగానపల్లి మండలం మామిళ్లపల్లి క్రాస్ వద్ద, ధర్మవరం వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం... సిబ్బంది సహాయంతో హత్యకు పాల్పడిన ముద్దాయిలు రామాంజనేయులు, రంగం రవీంద్ర, భూమా లోకేష్, కావలి శ్రీకాంత్, జంపుల శ్రీనివాసులు నాయుడులను అరెస్టు చేసినట్లు తెలిపారు. మృతుడు సంపత్‌కుమార్ తండ్రి రాజశేఖర్, హిందూపురంలోని అతని స్నేహితుడు శ్రీకాంత్‌కి, ఈ కేసులో ముద్దాయిలైన కృష్ణారెడ్డి అతని కుమారుడు నాగార్జున రెడ్డి మధ్య స్థలం తగాదా విషయమై పలుమార్లు గొడవలు జరిగాయని... సంబంధిత పోలీస్ స్టేషన్లో ఇరు వర్గాలపై కేసులు కూడా నమోదైనట్లు తెలిపారు. సదరు విషయాలపై అవమానంగా భావించిన లాయర్ కృష్ణారెడ్డి అతని కుమారుడు నాగార్జున రెడ్డి ఎలాగైనా స్నేహితుడు శ్రీకాంత్‌ను, లాయర్ సంపత్ కుమార్ ను చంపాలని కుట్ర పన్నారని...ఇందుకోసం ముదిరెడ్డిపల్లికి చెందిన రామాంజనేయులు, అతని అనుచరులైన రంగం రవీంద్ర, భూమా లోకేష్, కావలి శ్రీకాంత్, జంపుల శ్రీనివాసుల నాయుడుతో ఒప్పందం చేసుకుని అడ్వాన్స్‌గా రూ. ఐదు లక్షలు ఇచ్చారని చెప్పారు. మే 29 రాత్రి పదిన్నర గంటల సమయంలో హిందూపురం మండలం కోటిపి గ్రామం నుంచి కర్నాటక రాష్ట్రం చింతలపల్లికి వెళ్లే తారు రోడ్డు పక్కనున్న కాలువ దగ్గరకు పిలుచుకొని పోయి... లిక్కరు తాగించి కొడవలి, బాకు, బీరు బాటిల్ సీసాతో పొడిచి, నరికి చంపేశారని...మృతదేహాన్ని కారు డిక్కీలో వేసుకొని ధర్మవరం టౌనులో రెండవ మరుగు చెరువు వద్ద పడేశారని తెలిపారు. కృష్ణారెడ నుంచి మే 30వ తేదీ ఉదయం అనంతపురం బళ్లారి రోడ్డులో రూ.పది లక్షల తీసుకొని, అనంతపూర్ లో కారు వదిలి పెట్టి హైదరాబాద్ పారిపోయారని తెలిపారు. ఈ కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని, బృందాలుగా ఏర్పడి సాక్షాధారాలను సేకరించి, ముద్దాయిలను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఒక కారు, ఏడు సెల్ ఫోన్లు, హత్యకు ఉపయోగించిన రెండు పిడిబాకులు, మూడు కొడవళ్లు, నగదు రూ.7,05,000 లు ముద్దాయిల నుండి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. అడ్వకేట్ సంపత్ కుమార్ ని చంపడానికి మొత్తం రూ.55 లక్షలకు ఒప్పందం చేసుకోగా రూ.15 లక్షలు వారికి అందిందని తెలిపారు. ఈ కేసులో ఇంకా పరారీలో ఉన్న ముద్దాయిలను త్వరలోనే అరెస్టు చేస్తామని డీఎస్పీ శ్రీనివాసులు వెల్లడించారు.

రాష్ట్ర శిక్షణా తరగతులు జయప్రదం చేయండి

ఏఐటీయూసీ నేత వెంకటసుబ్బయ్య విజ్ఞప్తి

విశాలాంధ్ర-నూజివీడు టౌన్: ఏఐటీయూసీ రాష్ట్ర శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటసుబ్బయ్య పిలుపునిచ్చారు. ఏఐటీయూసీ రాష్ట్ర శిక్షణా తరగతులు నూజివీడులో జరగనున్న నేపథ్యంలో ఏఐటీయూసీ ముఖ్యనాయకుల సమావేశం యూనియన్ కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఎస్.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ రెండు రోజులు నూజివీడులో జరిగే శిక్షణా తరగతులలో సంఘటిత, అసంఘటితరంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చిస్తామన్నారు. పాలకులు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు, కార్మికుల సమస్యలు, సంఘాల ఏర్పాటు ఇతర నిర్మాణపరమైన విషయాలు చర్చిస్తామన్నారు. కొత్తగా ఏర్పడిన ఎన్డీఏ ప్రభుత్వం కార్మికులకు సంఘటిత, అసంఘటిత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఆయన కోరారు. ఏఐటీయూసీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు చలసాని రామారావు, నూజివీడు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి చాట్ల పుల్లారావు, ముఠా వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు ఎం.శ్రీను, సహాయ కార్యదర్శి కె.రామ్మూర్తి, హెచ్‌పీ గ్యాస్ యూనియన్ నాయకులు వేణుగోపాలరావు, శ్రీను, వెంకటేశ్వరరావు, దుర్గారావు పాల్గొన్నారు.

వయోపరిమితి 47 ఏళ్లకు పెంచాలి

ఏపీ నిరుద్యోగ జేఏసీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎన్డీఏ కూటమి పార్టీలు నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను చిత్తశుద్ధితో అమలు చేయాలని, ఉద్యోగాల భర్తీలో నిరుద్యోగుల వయోపరిమితి 47 ఏళ్లకు(జనరల్) పెంచాలని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సమయం హేమంత్‌కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆయన కూటమి నేతలు చంద్రబాబు, పవన్, పురందేశ్వరికి లేఖ రాశారు. నిరుద్యోగుల వయోపరిమితి 47 ఏళ్లకు పెంచి... డీఎస్సీ తదితర విభాగాల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలన్నారు. డీఎస్సీలో వ్యాయామ ఉపాధ్యాయులకు చోటుకల్పించాలని పేర్కొన్నారు. హోంగార్డులను ప్రభుత్వంలో విలీనం చేయాలని, గ్రూప్ 1 డిప్యూటీ డీఈవో ఉద్యోగాల భర్తీలో 1:100 విధానం అమలు చేయాలని కోరారు. నిరుద్యోగుల నుంచి ఒకరికి ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని విన్నవించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

అతిథులతో హోటళ్ల కిటకిట

- చంద్రబాబు ప్రమాణస్వీకార జోష్
- వీఐపీల బస ప్రాంగణంలో భద్రత
- పార్టీ శ్రేణులతో విజయవాడ రద్దీ
- గన్నవరంలో ముఖ్యనేతలకు స్వాగతం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టీడీపీ అధినేత నారా చంద్రబాబు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనుండటంతో విజయవాడ పరిసర ప్రాంత హోటళ్లు రద్దీగా మారాయి. తెలుగు రాష్ట్రాలకు చెందిన ప్రముఖులు, రాజకీయ నేతలు, ఢిల్లీకి చెందిన మంత్రులు, ప్రముఖుల రాకతో స్టార్ హోటళ్ల నుండి సాధారణ హోటళ్ల వరకు ముందస్తుగానే బుకింగ్‌లు చేసుకున్నారు. ఈనెల 4వ తేదీన ఎన్నికల ఫలితాల్లో ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధించింది. దీంతో కూటమి తరపున చంద్రబాబును శాసనసభ పక్ష నేతగా ఎన్నుకున్నారు. గన్నవరం కేసరిపల్లిలోని ఐటీ టవర్ దగ్గర విశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేదికపై బుధవారం ఉదయం 11.27 గంటలకు సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. బాబు ప్రమాణ స్వీకార ముహూర్తం వెల్లడించిన వెంటనే విజయవాడ నగర పరిసర ప్రాంతాల్లోని హోటల్ గదులన్నీ బుక్కయిపోయాయి. మంగళవారం సాయంత్రానికే కూటమి నేతలు వివిధ ప్రాంతాల నుంచి విజయవాడకు చేరుకున్నారు. గన్నవరం విమానాశ్రయం వీఐపీలతో రద్దీగా మారింది. గన్నవరం నుంచి వివిధ రాష్ట్రాలకు చెందిన బీజేపీ నేతలు, కేంద్ర మంత్రులు విజయవాడకు చేరుకున్నారు. గన్నవరం-విజయవాడ మధ్య వీఐపీల వాహనాలతో సందడి వాతావరణం నెలకొంది. గన్నవరంలో వీఐపీలకు స్వాగతం పలికేందుకు కూటమి పార్టీల నేతలు పోటీపడ్డారు. ముఖ్యనేతలకు పుష్పగుచ్ఛాలు ఇచ్చి ఘన స్వాగతం పలికారు. ఎక్కడ చూసినా వీఐపీలు, వారి భద్రతా సిబ్బందితో హడావుడి కనిపించింది. తెలుగు రాష్ట్రాల్లోని టీడీపీ, జనసేన, బీజేపీ ముఖ్యనేతలు, పార్టీ శ్రేణులు భారీగా విజయవాడకు చేరుకున్నారు. వారిలో కొందరు విమానాలు, రైళ్లు, బస్సుల ద్వారా తరలివచ్చారు. దీంతో జాతీయ రహదారులపై రద్దీ కన్పించింది. హైదరాబాద్ నుంచి ఏపీకి ప్రత్యేక కార్ల ద్వారా టీడీపీ అభిమానులు చేరుకుని, ప్రమాణ స్వీకారం కోసం ఏర్పాటు చేసిన పాస్‌లను తమ నేతల ద్వారా తీసుకుని ముందస్తుగా సిద్ధం చేసుకున్నారు. ఏపీలోని 26జిల్లాల నుంచి ఎన్డీఏ కూటమి పార్టీల ఎమ్మెల్యే, ఎంపీలు, ఎమ్మెల్సీలు విజయవాడలోనే మకాం వేశారు. దీంతో అన్ని ప్రధాన హోటళ్లు బిజీబిజీగా మారాయి. వారితోపాటు నియోజకవర్గ నేతలు, ముఖ్యకార్యకర్తలతో హోటళ్ల దగ్గర సందడి వాతావరణం ఏర్పడింది. చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి తెలుగు రాష్ట్రాల తరపున ముఖ్యఅతిధిగా చిరంజీవిని ఆహ్వానించారు. వారి కుటుంబ సభ్యులతో కలిసి చిరంజీవి విజయవాడ చేరుకోనున్నారు. ఇప్పటికే చంద్రబాబు, బాలకృష్ణ కుటుంబ సభ్యులు అమరావతికి చేరుకున్నారు. విజయవాడలో బస చేసిన అతిధులంతా బుధవారం ఉదయం బయల్దేరి, గన్నవరంలోని చంద్రబాబు ప్రమాణ స్వీకరానికి వెళ్లనున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన ఎన్డీఏ పక్ష నేతలు, టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, సానుభూతి పరుల రాకతో కూటమిలో జోష్ నెలకొంది. విజయవాడలో వీఐపీలు బసచేసే హొటళ్ల దగ్గర ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. కేంద్ర హెూంమంత్రి అమిత్‌షా విజయవాడకు చేరుకోవడంతో ఆయన బసచేసే ప్రాంతంలోను భద్రతను కట్టుదిట్టం చేశారు. ఈ ప్రమాణ స్వీకారానికి గన్నవరం సమీపంలోని కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల పార్టీ శ్రేణులు ద్విచక్ర వాహనాల ద్వారా తరలిరానున్నారు.

విజయవాడకు సింగపూర్, కొరియా కాన్సులేట్ జనరల్స్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: చంద్రబాబు ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరయ్యేందుకు సింగపూర్, కొరియా కాన్సులేట్ జనరల్స్, ఇతర ప్రముఖులు విజయవాడ చేరుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాకముందే టీడీపీ అధినేత చంద్రబాబు విదేశీ పెట్టుబడుల కోసం పావులు కదుపుతున్నారు. దీనిలో భాగంగానే తన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరు కావాలని కోరుతూ జపాన్, దక్షిణ కొరియా, నెదర్లాండ్స్ కాన్సులేట్ జనరల్స్‌కు ఆహ్వానం పంపారు. దీంతో మంగళవారం రాత్రికి సింగపూర్, కొరియా కాన్సులేట్ జనరల్స్ విజయవాడ చేరుకున్నారు. ఇప్పటికే తమిళ సూపర్‌స్టార్ రజనీకాంత్, మెగాస్టార్, కేంద్ర మాజీమంత్రి చిరంజీవి కూడా విజయవాడ వచ్చారు. కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షులు నడ్డా, కొందరు కేంద్ర మంత్రులు, ఎన్డీఏ పక్ష నేతలు విజయవాడ చేరుకున్నారు. వీరందరికీ ఉండవల్లి కరకట్ట సమీపంలో చంద్రబాబు నివాసంలో కృష్ణా నదీ తీరాన ప్రత్యేక విందు ఏర్పాటు చేశారు.

బుధవారం
12-06-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 351
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

రాహుల్ రాయ్‌బరేలి సీటు నిలుపుకోవాలి
అమేథి ఎంపీ

లక్నో : రాయ్‌బరేలి ప్రజలు రాహుల్ గాంధీ తమ ఎంపీగా కొనసాగాలని కోరుకుంటున్నారని, వ్యక్తిగతంగా తాను కూడా రాహుల్ రాయ్‌బరేలి నుంచే పార్లమెంట్‌కు ప్రాతినిధ్యం వహించాలని కోరుకుంటానని అమేథి కాంగ్రెస్ ఎంపీ కిశోరీ లాల్ శర్మ పేర్కొన్నారు. రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ మంగళవారం రాయ్ బరేలి రావడంతో ప్రజల్లో ఉత్తేజం నెలకొందని అన్నారు. రాహుల్, ప్రియాంక కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగిస్తారని చెప్పారు. కాగా లోక్‌సభ ఎన్నికల్లో రాయ్‌బరేలి, కేరళలోని వయనాడ్ స్థానాల నుంచి రాహుల్ గాంధీ పోటీచేయగా, రెండు స్థానాల్లోనూ ఆయన విజయం సాధించారు.

సర్వం సిద్ధం

నాల్గవసారి సీఎంగా చంద్రబాబు

- ఉదయం 11.27 ని.లకు ప్రమాణ స్వీకారం
- ఆయనతో పాటు పవన్ కల్యాణ్, మంత్రులు
- హాజరవుతున్న మోదీ, అమిత్ షా, ఎన్డీఏ పక్ష ముఖ్య నేతలు
- ఏర్పాట్లు పూర్తి... 7 వేల మంది పోలీసు బలగాలతో భద్రత

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి :
రాష్ట్ర ముఖ్యమంత్రిగా నాలుగోసారి టీడీపీ అధినేత చంద్రబాబు బాధ్యతలు స్వీకరించబోతున్నారు. గన్నవరం విమానాశ్రయానికి అతి సమీపంలోని కేసరపల్లిలోని ఐటీ టవర్ వద్ద బుధవారం ఉదయం 11.27 గంటలకు సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆయనతో పాటు జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా, కూటమి చెందిన మరికొందరు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో పాటు ఎన్డీఏ పక్ష ముఖ్యనేతలు విచ్చేస్తున్నారు. దీంతో దాదాపు ఏడు వేల మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తుండగా, గత ఐదు రోజులుగా కొనసాగుతున్న ప్రమాణ స్వీకార కార్యక్రమం ఏర్పాట్లు మంగళవారం రాత్రి కొలిక్కి వచ్చాయి. ఈ కార్యక్రమం కోసం కేసరపల్లిలో 14 ఎకరాల సభా ప్రాంగణాన్ని తీర్చిదిద్దారు. పార్కింగ్ కోసం మరో 56 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. వేదికను అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. సభా ప్రాంగణంలో ప్రముఖుల కోసం ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేసి, ప్రతి గ్యాలరీకి ఒక అధికారిని ఇన్‌ఛార్జ్‌గా నియమించారు. ప్రజాప్రతినిధులు, వారి కుటుంబ సభ్యులు, న్యాయమూర్తులు, ఐఏఎస్‌లు, ఐపీఎస్ అధికారులు, ప్రత్యేక అతిథులు, ఆహ్వానితులు, మీడియా ప్రతినిధుల కోసం ప్రత్యేక గ్యాలరీలను ఏర్పాటు చేశారు. వీరందరికీ ప్రత్యేకంగా నియమించిన అధికారులు మంచినీరు, అల్పాహారం, ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేస్తారు. వీవీఐపీలకు పాసుల ప్రకారం సీటింగ్ కేటాయిస్తారు. ఆయా సీట్లలో వారిని కూర్చోబెట్టే బాధ్యతను గ్యాలరీ ఇన్‌ఛార్జ్‌లకు అప్పగించారు. ఇందుకోసం వివిధ జిల్లాలకు చెందిన సంయుక్త కలెక్టర్లు, సబ్‌కలెక్టర్‌లు,

- మిగతా 5 లో

చంద్రబాబు ఫోన్... స్పందించని జగన్ !

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
ప్రమాణ స్వీకారానికి ఆహ్వానించేందుకు టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మాజీ సీఎం వైఎస్ జగన్‌కు ఫోన్ చేశారు. అయితే ఆయన అందుబాటులోకి రాలేదని తెలిసింది. ఈ విషయం మీడియాలో ప్రచారమైంది. బుధవారం ఉదయం గన్నవరం కేసరపల్లి దగ్గర సీఎంగా చంద్రబాబు ప్రమాణం చేయనున్న సంగతి తెలిసిందే. దీనికి కేంద్ర, రాష్ట్రాలకు చెందిన ముఖ్యనేతలను చంద్రబాబు స్వయంగా ఆహ్వానించారు. జగన్‌ను కూడా ఆహ్వానించేందుకు చంద్రబాబు ఫోన్ చేసినప్పటికీ

- మిగతా 5 లో

ప్రతి అడుగు ప్రజలకోసమే

ఈ తీర్పు మాకు అధికారం కాదు, బాధ్యత

- అమరావతే మన రాజధాని
- పోలవరం పూర్తి చేసి ప్రతి ఎకరాకూ నీళ్లిస్తాం
- కూల్చివేతలకు, కక్షసాధింపులకు దూరం
- తప్పు చేసిన వాళ్లను చట్టప్రకారం శిక్షిస్తాం
- ఎన్డీయే పక్ష నేతగా చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి:
రాష్ట్రంలో రేపటి నుంచి ప్రజాపాలన సాగుతుందని, ప్రతి నిర్ణయం...ప్రతి అడుగు ప్రజల కోసమే ఉంటుందని టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రజావేదికలా కూల్చివేతలు, మూడు రాజధానుల పేరుతో ఆటలు ప్రజా ప్రభుత్వంలో ఉండవని ఉద్ఘాటించారు. బాధ్యతాయుతమైన, సానుకూల ప్రభుత్వం ఉంటుందని చంద్రబాబు హామీ ఇచ్చారు. ప్రజలు తమకు ఇచ్చింది అధికారం కాదని, అతిపెద్ద బాధ్యత అని పేర్కొన్నారు. అశాంతికి తావు లేకుండా రాష్ట్రంలో పాలన ఉంటుందన్నారు. విజయవాడలోని ఏ కన్వెన్షన్ హాల్‌లో మంగళవారం జరిగిన ఎన్డీయే కూటమి ఎమ్మెల్యేల సమావేశంలో చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి పాల్గొన్నారు. ఎన్డీయే కూటమి శాసనసభాపక్ష నేతగా చంద్రబాబు పేరును పవన్ కల్యాణ్ ప్రతిపాదించగా పురందేశ్వరి, అచ్చెన్నాయుడు బలపరిచారు. కూటమి ఎమ్మెల్యేలంతా ఆమోదం తెలిపారు. అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ తాను చాలా ఎన్నికలు చూశానుకానీ ఈ ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పు రాష్ట్ర చరిత్రలో నిలిచిపోతుందన్నారు. కూటమికి ఘన విజయం అందించిన ప్రజలకు శిరసు వంచి పాదాభివందనం చేస్తున్నానన్నారు. ప్రమాదంలో ఉన్న రాష్ట్రాన్ని కాపాడుకోవడానికి

- మిగతా 5 లో

కోటీశ్వరులు... నేరగాళ్లు!

- రూ.5,705 కోట్లతో పెమ్మసాని అగ్రస్థానం
- 28 మంది మంత్రులపై నేర కేసులు
- మోదీ మంత్రివర్గంపై ఏడీఆర్ విశ్లేషణ

న్యూఢిల్లీ:
నరేంద్ర మోదీ ప్రభుత్వంలో కొత్తగా ప్రమాణస్వీకారం చేసిన మంత్రుల ఆస్తులు రూ.100 కోట్లకు పైబడిన వారు ఆరుగురు ఉన్నారు. జాతీయ ఎన్నికల నిఘా సంస్థతో పాటు అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) కలిసి ఇచ్చిన నివేదిక ప్రకారం... 28 మంది మంత్రులు తమ ఎన్నికల అఫిడవిట్‌లలో తమపై నేర కేసులు ప్రకటించారు. 19 మంది మహిళలపై నేరాలతో సహా భారతీయ శిక్షాస్మృతి (ఐపీసీ)లోని వివిధ సెక్షన్ల కింద తీవ్రమైన నేరాలకు పాల్పడ్డారు. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఇద్దరు బీజేపీ ఎంపీలు హత్యానేరం ఎదుర్కొంటున్నారు. ఆదివారం (జూన్ 9) ప్రమాణ స్వీకారం చేసిన 72 మంది మంత్రుల్లో 71 మంది సమర్పించిన అఫిడవిట్‌ల ఆధారంగా ఈ నివేదిక రూపొందింది. జార్జ్ కురియన్ ప్రస్తుతం ఏ సభలోనూ సభ్యుడు కానందున...అతని వివరాలు విశ్లేషించలేదని ఏడీఆర్ ఒక ప్రకటనలో తెలిపింది. బీజేపీకి చెందిన బండి సంజయ్ కుమార్, శంతను ఠాకూర్, సుకాంత మజుందార్, సురేశ్ గోపి, జుయల్ ఓరమ్ మహిళలపై నేరాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న మంత్రులలో ఉన్నారు. ఎనిమిది మంది మంత్రులపై ద్వేషపూరిత ప్రసంగాల ఆరోపణలు ఉన్నాయి. వారిలో అమిత్ షా, శోభా కరంద్లాజే, ధర్మేంద్ర ప్రధాన్, గిరిరాజ్ సింగ్, నిత్యానంద్ రాయ్, బండి సంజయ్ కుమార్, శంతను ఠాకూర్, సుకాంత మజుందార్ ఉన్నారు. 71 మంది మంత్రుల్లో 70 మంది 'కోటీశ్వరులు' లేదా కోటి రూపాయల చొప్పున ఆస్తులు కలిగి ఉన్నారు. అత్యధికంగా సంపద కలిగి ఉన్నట్లు ప్రకటించిన ఆరుగురిలో డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని రూ.5,705 కోట్లు, జ్యోతిరాదిత్య సింధియా రూ.424 కోట్లు, హెచ్‌డీ కుమారస్వామి రూ.217 కోట్లు, అశ్వినీ వైష్ణవ్ రూ.144 కోట్లు, రావు ఇంద్రజిత్ సింగ్ రూ.121 కోట్లు, పీయూష్ గోయల్ రూ.110 కోట్లు.

హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌పై 42 కేసులు

హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్‌పై కనీసం 30 'తీవ్రమైన అభియోగాలతో' 42 కేసులు ఉండగా, ఓడ రేవులు, షిప్పింగ్, జలమార్గాల జూనియర్ మంత్రి శంతను ఠాకూర్‌పై 23 కేసులు, 37 తీవ్రమైన అభియోగాలు ఉన్నాయి. విద్యాశాఖ సహాయ మంత్రి సుకాంత మజుందార్‌పై 16 కేసులు, 30 తీవ్రమైన అభియోగాలు ఉన్నాయి. కాగా, నాన్ బెయిలబుల్ నేరాల గరిష్ఠంగా ఐదు సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ శిక్ష విధించే నేరాలు, ఎన్నికల నేరాలు, ఖజానాకు నష్టం,

- మిగతా 5 లో

ఒడిశా కొత్త సీఎంగా మాఝీ

డిప్యూటీ సీఎంలుగా కనక వర్ధన్, ప్రవతి పరిదా

భువనేశ్వర్ :
బీజేపీకి చెందిన మోహన్ చరణ్ మాఝీ ఒడిశా తదుపరి ముఖ్యమంత్రి అవుతారని పార్టీ సీనియర్ నేత, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మంగళవారం ప్రకటించారు. 52 ఏళ్ల మాఝీ నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. కోస్తా రాష్ట్రంలో ప్రముఖ గిరిజన నాయకుడిగా ఆయన ఉన్నారు. ఉప ముఖ్యమంత్రులుగా కనక్ వర్ధన్ సింగ్ దేవ్, ప్రవతి పరిదా ఉంటారని సింగ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త ప్రభుత్వంలో ఇద్దరు ఉప ముఖ్యమంత్రులు ఉంటారని, బీజేపీ శాసనసభాపక్ష సమావేశంలో మాఝీ పేరును ఏకగ్రీవంగా ఆమోదించినట్లు వెల్లడించారు. 'ఒడిశా

- మిగతా 5 లో

అమ్మాయిల సత్తా

- 1,95,092 మంది అర్హత
- ఇంజినీరింగ్ 75.51, అగ్రికల్చర్ 87.11 శాతం ఉత్తీర్ణత
- ఏపీ ఈఏపీ సెట్ ఫలితాలు విడుదల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్, వ్యవసాయ, ఫార్మసీ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఏపీ ఈఏపీసెట్-2024) ఫలితాల్లో అమ్మాయిలు సత్తా చాటారు. ఇంజినీరింగ్, అగ్రికల్చర్‌లో ఆంధ్రప్రదేశ్‌తోపాటు తెలంగాణ విద్యార్థులు టాప్ 10 ర్యాంకులు కైవసం చేసుకున్నారు. విజయవాడ హోటల్ ఫార్చ్యూన్ మురళీలో ఉన్నత విద్య ముఖ్యకార్యదర్శి జె.శ్యామలరావు, ఉన్నత విద్యామండలి ఇన్‌చార్జి చైర్మన్ కె.రామమోహనరావు, జేఎన్‌టీయూ కాకినాడ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు, ఏపీ ఈఏపీసెట్ కన్వీనర్ వెంకటరెడ్డి తదితరులు ఫలితాలను మంగళవారం విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 3,39,139 మంది విద్యార్థులు ఇంజినీరింగ్, అగ్రికల్చర్ పరీక్షలు రాశారు. ఇంజినీరింగ్ విభాగంలో మొత్తంగా 75.51శాతం ఉత్తీర్ణతా శాతం నమోదు కాగా...ఇందులో బాలికలు 77.65, అబ్బాయిలు 73.93 శాతం అర్హత సాధించారు.

అగ్రికల్చర్ విభాగంలో బాలికల కంటే బాలురు స్వల్పంగా పైచేయి సాధించారు. మొత్తం 87.11 శాతం నమోదు కాగా, ఇందులో బాలికలు 86.81, అబ్బాయిలు 87.98 శాతం అర్హత సాధించారు. ఇంజినీరింగ్ విభాగంలో మొత్తం 2,58,374 మంది పరీక్ష రాయగా, వారిలో 1,95,092 మంది (75.51శాతం) అర్హత సాధించారు. వారిలో అగ్రికల్చర్ విభాగంలో 80,766 మంది పరీక్ష రాయగా, 70,352 మంది(87.11శాతం) అర్హత సాధించారు. అభ్యర్థులు సాధించిన మార్కులకు 75 శాతం, ఇంటర్ మార్కులకు 25 శాతం ఆధారంగా

- మిగతా 5 లో

'నీట్' కౌన్సెలింగ్‌పై
స్టే ఇవ్వలేం

సుప్రీం



న్యూఢిల్లీ:
వైద్యవిద్యా కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ యూజీ-2024 పరీక్షలో అవతవకలు జరిగినట్లు కొన్ని రోజులుగా ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ క్రమంలోనే నీట్ ప్రవేశ పరీక్ష రద్దు చేయాలంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ అమానుల్లాతో కూడిన వెకేషన్ బెంచ్ మంగళవారం విచారణ జరిపింది. పరీక్ష రద్దు చేయడం అంత సులువు కాదని ధర్మాసనం అభిప్రాయపడింది. 'ఇది మీరు అనుకున్నంత సులభం కాదు. అలా చేస్తే పరీక్షకు ఉన్న గౌరవం, పవిత్రత దెబ్బతింటాయి. అందువల్ల ఈ ఆరోపణలపై మాకు సమాధానాలు కావాలి' అని ధర్మాసనం పేర్కొంది. దీనిపై స్పందన తెలియజేయాలని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ)కి నోటీసులు జారీ చేసింది. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థుల కౌన్సెలింగ్ ప్రక్రియపై స్టే ఇచ్చేందుకు ధర్మాసనం నిరాకరించింది. తదుపరి విచారణను జులై 8వ తేదీకి వాయిదా వేసింది. అలోగా

- మిగతా 5 లో

కుప్పకూలిన విమానం

- మలావీ ఉపాధ్యక్షుడు దుర్మరణం
- మరో 9 మంది మృతి

బ్లాంటైర్:
ఆఫ్రికా దేశమైన మలావీలో విమానం అదృశ్యమైన ఘటన విషాదాంతమైంది. అది పర్వత ప్రాంతాల్లో కూలిపోయిందని, ఈ ఘటనలో ఉపాధ్యక్షుడు సౌలస్ షిలిమా సహా 10 మంది దుర్మరణం చెందినట్లు ఆ దేశాధ్యక్షుడు లాజరస్ చక్వేరా వెల్లడించారు. గల్లంతైన విమానం శకలాలు గుర్తించామని, అందులో ఎవరూ ప్రాణాలతో లేరని తెలిపారు. మలావీ ఉపాధ్యక్షుడు, మరో తొమ్మిది మందిని తీసుకెళ్తున్న సైనిక విమానం సోమవారం అదృశ్యమైంది. రాజధాని లిలోంగ్వే నుంచి బయలుదేరిన ఆ విమానం 370 కిలోమీటర్ల దూరంలోని జుజు

- మిగతా 5 లో

ఇదీ లోకం!

సార్‌ర్ వీళ్లకి కుర్చీలు దగ్గర వెయ్యాలా? దూరంగా వేయమంటారా?

వర్సిటీలు, ఉన్నత విద్యాసంస్థల్లో
ఏడాదికి రెండుసార్లు ప్రవేశాలు

- తప్పనిసరికాదు... వనరులుంటే అమలు ప్రయోజనకరం
- యూజీసీ చైర్మన్ జగదీశ్ కుమార్

న్యూఢిల్లీ:
విదేశీ విశ్వవిద్యాలయాల తరహాలో భారత విశ్వవిద్యాలయాలు, ఉన్నత విద్యాసంస్థలు ఇప్పుడు సంవత్సరానికి రెండుసార్లు ప్రవేశాలకు అనుమతి ఇచ్చేందుకు విశ్వవిద్యాలయాల గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ప్రణాళికకు ఆమోదం తెలిపిందని యూజీసీ చీఫ్ జగదీష్ కుమార్ తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరం నుంచి రెండు అడ్మిషన్ విధానం జులై-ఆగస్టు, జనవరి-ఫిబ్రవరిగా ఉండనున్నది. 'భారత విశ్వవిద్యాలయాలు సంవత్సరానికి రెండుసార్లు అడ్మిషన్‌ను అందించగలిగితే, బోర్డు ఫలితాల ప్రకటనలో జాప్యం, ఆరోగ్య సమస్యలు లేదా వ్యక్తిగత కారణాల వల్ల జులై-ఆగస్టు సెషన్‌లో విశ్వవిద్యాలయంలో అడ్మిషన్‌ను కోల్పోయిన వారి వంటి చాలా మంది విద్యార్థులకు ఇది ప్రయోజనం చేకూరుస్తుంది' అని కుమార్ పీటీఐకి చెప్పారు. 'ద్వైవార్షిక విశ్వవిద్యాలయాల ప్రవేశాలు విద్యార్థులు ప్రస్తుత చక్రంలో అడ్మిషన్‌ను కోల్పోయినట్లయితే వారు ఒక సంవత్సరం పూర్తి కాలం వేచి ఉండాల్సిన అవసరం లేదు. అందువల్ల వారు విద్యను కొనసాగించడంలో సహాయపడతాయి. ద్వైవార్షిక ప్రవేశాలతో పరిశ్రమలు తమ క్యాంపస్ నియామకాలను

- మిగతా 5 లో

సంపాదకీయం

భగవత్ బూటక హితోపదేశం

ఆర్.ఎస్.ఎస్. అధినేత మోహన్ భగవత్ మధ్యమధ్యలో మోదీ ప్రభుత్వానికి సలహాలు ఇస్తూనే ఉంటారు. అయితే అవి అవసరమైనప్పుడు కూడా తీవ్రంగా ఉండవు. సుతిమెత్తగానే భగవత్ మాట్లాడుతుంటారు. మోదీ నాయకత్వంలో మూడోసారి ప్రభుత్వం ఏర్పడిన సందర్భంలో ఆయన అహంకారం ఉండకూడదన్నారు. ఈ మాట చెప్పడంలో ఆయన మోదీ పేరెత్తకపోయినా అది మోదీని ఉద్దేశించి అన్న మాటేనని చెప్పక్కర్లేదు. గత పదేళ్లుగా మోదీ ప్రభుత్వ సుపరిపాలనవల్లే మూడోసారి బీజేపీ అధికారంలోకి వచ్చిందని భగవత్ చెప్పడం పక్షపాత దృష్టితో చెప్పిందే తప్ప నిరపేక్షంగా పరిస్థితిని గమనించి చెప్పిందికాదు. ఆర్.ఎస్.ఎస్. నిర్దేశించిన లక్ష్యాలకన్నా మోదీ మరింతగా హిందుత్వ విధానాలను అమలు చేయడం కచ్చితంగా ఆర్.ఎస్.ఎస్. అధినేతకు సంతోషమే కలిగించి ఉంటుంది. మైనారిటీ మతాలవారు, ముఖ్యంగా ముస్లింలమీద మోదీ చూపిన విద్వేషం ఆర్.ఎస్.ఎస్. ఎజెండాలోని అంశమే కనక భగవత్ ఆ ఊసే ఎత్తలేదు. నిజానికి మోదీ పదేళ్లుగా, మరీ మాట్లాడితే 2019 తరవాత మోదీ నడిపింది బీజేపీ ప్రభుత్వం అని అనడానికి కూడా అవకాశం లేదు. మోదీ సకల పనులు తన ఖాతాలోనే వేసుకునే మనిషి. అన్నీ తానే చేశానని చెప్పుకుంటారు తప్ప ఉదాహరణ ప్రాయంగా కూడా బీజేపీ పేరెత్తలేదు. ఎన్నికల ప్రచార సమయంలోనూ "మోదీ గ్యారంటీలు" అన్నారు తప్ప అందులో బీజేపీ ప్రస్తావనే లేదు. ఇటీవలి ఎన్నికలలో మోదీ అహంకారాన్ని దెబ్బతీసే రీతిలో ఫలితాలు వచ్చాయి. కనీసం ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి అవసరమైన బొటాబొటి మెజారిటీ కూడా మోదీ నాయకత్వం సంపాదించలేకపోయింది. ఎన్.డి.ఎ. కూటమిలోని పార్టీలు సాధించిన విజయాలను కూడా కలిపితే తప్ప ప్రభుత్వం ఏర్పాటుచేసే అవకాశం రాలేదు. మోహన్ భగవత్ అహంకారాన్ని తగ్గించుకోవాలని నిర్దిష్టంగా మోదీ పేరెత్తి చెప్పలేదు. మోదీ నిరంకుశాధికారాన్ని, ఆధిపత్య ధోరణినీ ప్రస్తావించలేదు. మోదీ ఇష్టారాజ్యం కొనసాగిస్తున్నా ఇంతవరకు ఆర్.ఎస్.ఎస్. అధినేత పల్లెత్తుమాట కూడా అనలేదు. దీనికి ప్రధాన కారణం మోదీ ప్రజాస్వామ్య వ్యవస్థలను విధ్వంసం చేయడం, మానవ హక్కులను కసితో కాలరాయడం భగవత్ దృష్టికి వచ్చిన దాఖలాలు లేవా? రాజకీయ వర్గాలు అభిప్రాయభేదాలను, వివాదాలుగా పరిగణించకూడదని, సవాళ్లను ఏకాభిప్రాయంతో ఎదుర్కోవాలని భగవత్ చెప్పిన మాట సంపూర్ణమైన మెజారిటీ వస్తే మెతకగా ఈ సలహా కూడా ఇచ్చేవారు కాదు. మోదీ ఆర్.ఎస్.ఎస్. ఎజెండాను అమలు చేసి ఉండొచ్చు కానీ తన మాతృసంస్థను ఖాతరు చేయకపోవడం భగవత్‌కు కనిపించినట్టు లేదు. వాజ్‌పేయి ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు సైతం ప్రధానమంత్రిని, అడ్వాణీని కూడా పిలిపించి ఆర్.ఎస్.ఎస్. అధినేతలు దాదాపు మందలించిన సందర్భాలున్నాయి. మోదీ హయాంలో ఆర్.ఎస్.ఎస్. ఆ సాహసమే చేయలేక పోయింది. పదమూడు నెలలనుంచి కుమ్మరి ఆవంగా తయారైన మణిపూర్ గురించి ఇంతకాలం తరవాత భగవత్‌కు గుర్తుకు రావడం విచిత్రమే. అక్కడ ఇప్పటికీ మారణకాండ కొనసాగుతూనే ఉంది. కనీసం బాధితులను పరామర్శించే సంస్కారం కూడా ప్రధానికి లోపించింది. అంటే ఆ మారణ కొనసాగిస్తున్న వారిమీద మోదీకి అభ్యంతరాలు ఏమీ లేవనే అనుకోవాలి. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మారణకాండ సమయంలో ఎలా ప్రవర్తించారో మణిపూర్ విషయంలోనూ అదే వైఖరి అనుసరించారు. రాజధర్మాన్ని గాలికి వదిలేశారు. అహంకారం ఉండకూడదని భగవత్ చెప్పింది శిక్షణ పూర్తి చేసుకుని వెళుతున్న 900 మంది ఆర్.ఎస్.ఎస్. కార్యకర్తలను ఉద్దేశించే. అంటే కొత్తగా శిక్షణ పొందిన వారికి వాస్తవ పరిస్థితి తెలియజేయాలన్న దృష్టి భగవత్‌కు లేదనే. ఎన్నికల ప్రచార సమయంలో దూషణపూర్వక భాష వినియోగించడం పొరపాటని, ఇది మర్యాదకరమైంది కాదని భగవత్ అన్నారే తప్ప దూషణలో మోదీనే అగ్రగామి అన్న విషయం ఎత్తనేలేదు. మోదీ పేరెత్తకపోవడం అంటే భగవత్ కేవలం ధర్మోపన్యాసం మాత్రమే చేసినట్టు లెక్క. మోదీ తిట్ల పంచాంగం గురించి సాధారణ జనానికి కూడా తెలుసు. ప్రతిపక్షాలను ఎంతగా తూలనాడారో, ముస్లింలను ఎలా కించపరిచారో జనం గ్రహించారు కనకే విలక్షణమైన తీర్పు ఇచ్చి మోదీకి మెజారిటీ దక్కకుండా చేశారు. మోదీ సన్నిహిత సహచరుడు అమిత్ షా తక్కువ తినలేదు. ఆయన మోదీతో పోటీ పడి ప్రతిపక్షాల మీద నిరాధారమైన నిందలు మోపారు.

నిజంగానే మోదీ అకృత్యాలను ఎత్తి చూపాలని భగవత్ భావించి ఉంటే కాంగ్రెస్ నాయకత్వంలోని ప్రతిపక్ష ఐక్య సంఘటన గెలిస్తే మీ మంగళ సూత్రాలు లాక్కుంటారు, మీకు రెండు గేదెలు ఉంటే ఒక గేదెను లాక్కెళ్లి పోతారు అని మోదీ అనడాన్ని ఆక్షేపించి ఉండేవారు. "ప్రతిపక్షం అంటే మీ శత్రువు కాదు, దానికి భిన్నాభిప్రాయం ఉందని మాత్రమే" లాంటి భగవత్ మాటలు అద్వితీయమైన నటనా చాతుర్యానికి నిదర్శనం. ప్రభుత్వ యంత్రాగాన్ని వినియోగించి ప్రత్యర్థులను వేధించినప్పుడు భగవత్ ఎందుకు పట్టించుకోలేదో అర్థం చేసుకోలేనంతటి అమాయకత్వం ఈ దేశ వాసులకు లేదు. భగవత్ హితోపదేశం అంతస్సారం ఆర్.ఎస్.ఎస్. విధానాలను సమర్థించుకోవడమే కాక, ఆ విధానాలను అమలు చేయడంలో కర్కశంగా ప్రవర్తించిన మోదీని సమర్థించడానికే. ఎన్నికలలో బీజేపీ విజయంలో ఆర్.ఎస్.ఎస్. పాత్ర ఏమీ లేదు అని ఇటీవల బీజేపీ అధ్యక్షుడు జె.పి.నడ్డా అన్నప్పుడు ఆర్.ఎస్.ఎస్. అధినేత చెవులు మూసుకుపోయాయని అనుకోలేం. ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన్ని ఉపయోగించుకుని అసత్య ప్రచారం చేస్తూ ఆర్.ఎస్.ఎస్.ను అందులోకి లాగుతున్నారు అని వాదిస్తున్న భగవత్ కు బీజేపీ ఐ.టి.సెల్ అసత్య, విద్వేష పూరిత ప్రచారాలు కనిపించలేదంటే నమ్మలేం. మోదీ హయాంలో పౌర హక్కుల కోసం పోరాడుతున్న వారి మీద కత్తిగట్టినట్టు ప్రవర్తించారు. వందలాదిమంది హక్కుల కార్యకర్తలను జైళ్లల్లోకి తోశారు. ఇంకా అనేక మంది ఆరేళ్లనుంచి జైళ్లలోనే మగ్గిపోతున్నారు. ఇది భగవత్‌కు అన్యాయం, చట్ట ధిక్కరణ అనిపించలేదు. భిన్నాభిప్రాయం వ్యక్తంచేసే వారిని బీజేపీ ఐ.టి. విభాగం వేటాడుతున్న వాస్తవం భగవత్‌కు తెలియదనుకోలేం. మర్యాద, మన్నన మోదీకి అలవాటులేని వ్యవహారాలే. సుద్దులు చెప్తున్న భగవత్‌కు అవి ఉన్నాయనుకుంటే ఆయన వాస్తవిక దృష్టితో మాట్లాడి ఉండేవారు. ఆర్.ఎస్.ఎస్. ఎజెండాను మోదీ అమలు చేస్తున్నందుకు ఆయన లోలోపల మహదానంద పడిపోతూనే ఉన్నారు. లేకపోతే నిజం మాట్లాడి ఉండేవారు. ఇతర పార్టీల్లో ఉన్న వారిని విపరీతమైన అవినీతి పరులన్న ముద్రవేసి వారి మీద ఇ.డి., సీబీఐ లాంటి దర్యాప్తు సంస్థలను ప్రయోగించి విధిలేక వారు బీజేపీలో చేరేట్టుచేసి, ఆ తరవాత పునీతులైనట్టు వ్యవహరించడం ఆర్.ఎస్.ఎస్.కు సమ్మతమే అనుకోవాలి. అంటే అవినీతిపరులను అక్కున చేర్చుకోవడం ఆర్.ఎస్.ఎస్.కు ఎంతమాత్రం అభ్యంతరకరం కాదనే. అధికారం నిలబెట్టుకోవడానికి మోదీ ఎన్ని అడ్డదారులు తొక్కినా ఆర్.ఎస్.ఎస్. కిమ్మనలేదు. ఆ మధ్య మోదీ నాగపూర్‌లో ఆర్.ఎస్.ఎస్. అగ్ర నాయకులను కలుసుకోవడమే కాక ఆ నగరంలో ఒక రాత్రి నిద్రచేసినప్పుడు ఈ నీతి బోధ భగవత్‌కు గుర్తుకు రాలేదుగా. భగవత్ హితోపదేశం అంతా బూటకం.

సర్కార్ బడుల్లో నాణ్యమైన విద్య సాధ్యమేనా?

ప్రభుత్వ పాఠశాలలకు పూర్వవైభవం తీసుకు వచ్చేందుకు, విద్యార్థుల నమోదుశాతాన్ని పెంచేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వినూత్నరీతిలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని చేపట్టింది. ఈసారి ప్రభుత్వ పాఠశాలల్లోనే వారిని చేర్పించి పిల్లలకు నాణ్యమైన విద్యనందించేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ "మీరు మీ బిడ్డను ప్రైవేట్ స్కూల్‌లో చేరిస్తే రూ.50,000 నుండి రూ. 1.5 లక్షలు ఖర్చువుతుంది. భవిష్యత్తులో మీ పిల్లల ఉన్నత చదువులకోసం ఈ డబ్బును ఆదా చేయండి అని ప్రభుత్వం వినూత్న ప్రచారానికి శ్రీకారం చుట్టింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రైవేట్ పాఠశాలలపై మోజు తగ్గించేందుకు తల్లిదండ్రుల్లో గతంలో ఎన్నడూలేని విధంగా మార్పు తీసుకురావడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రతి పాఠశాలలో 'అమ్మ ఆదర్శ పాఠశాల' కమిటీలను ఏర్పాటు చేశారు. వీటికింద అన్ని పాఠశాలలను కొత్త ఫీచర్లతో తీర్చిదిద్దుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆంగ్ల, తెలుగు మీడియంలో విద్యతోపాటు విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం అందించారు. ఈ విద్యా సంవత్సరంలో విద్యార్థులకు ఒక జత బూట్లు ఉచితంగా అందజేస్తున్నారు. జూన్ 19 వరకు బడిబాట నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. అధిక ఉత్తీర్ణత సాధించిన పిల్లలను, డ్రాపౌట్‌లను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేందుకు అమ్మ ఆదర్శ కమిటీలతోపాటు విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, యువజన సంఘాలు, ప్రజా ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఈ బడిబాట సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల పునరుద్ధరణపై విస్తృత ప్రచారంచేపట్టి ఆలోచనా విధానంలో మార్పు తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖ అధికారులకు, జిల్లా కలెక్టర్లకు ఆదేశాలు జారీచేశారు.

రాష్ట్రంలోని మొత్తం 26,823 పాఠశాలల్లో 20,680 అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలను ఇప్పటికే ఏర్పాటు చేశారు. 17,729 పాఠశాలల్లో అవసరమైన అన్ని పనులు ఈ కమిటీలకు అప్పగించారు. ఈ వేసవిలో పాఠశాలల్లో తలుపులు, కిటికీలు, బ్లాక్ బోర్డులు, విద్యుత్ స్విచ్ బోర్డులు, ఫ్యాన్స్, మరుగుదొడ్ల తాత్కాలిక మరమ్మత్తులన్నింటినీ ప్రభుత్వం ప్రారంభించింది. ప్రభుత్వ పాఠశాలల ప్రత్యేకతలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం చేసేందుకు సిద్ధమవుతోంది. బడి ఈడు పిల్లలందరూ పాఠశాలల్లో చేరేలా కార్యక్రమాలకు ప్రణాళిక రూపొందించారు. జూన్ 12న బడులు తెరిచాక ఆరురోజులపాటు ప్రత్యేక కార్యక్రమాలు జరపనున్నారు. తొలిమెట్టు, సామూహిక విద్యాభ్యాసం, పదోతరగతి, ఇంటర్ పూర్తిచేసిన అమ్మాయిలకు ఉన్నత విద్య, కెరీర్‌పై అవగాహన కల్పిస్తారు. చదువుకు దూరమైన పిల్లలను పాఠశాలల్లో చేర్పించడంతోపాటు సర్కారు బడుల్లో విద్యార్థులను పెంచేందుకు విద్యాశాఖ సిద్ధమవుతోంది. జూన్ 3 నుంచి జూన్ 17వ తేదీ వరకు పండగ వాతావరణం ప్రతిబింబించేలా ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమం నిర్వహించాలని నిర్ణయించింది. బడిబాట లక్ష్యాలు, నిర్వహణతీరుపై విధివిధానాలు వివరిస్తూ డీఈఓలకు రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ శ్రీదేవసేన ఉత్తర్వులు పంపించారు. నేడు దేశవ్యాప్తంగా ప్రభుత్వ కళాశాలలు విశ్వవిద్యాలయాలలో విద్యా ప్రమాణాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. గణితం, సైన్స్, సోషల్ స్టడీస్, ఇంగ్లీష్‌లలో పదవ తరగతి విద్యార్థుల అభ్యసన సామర్థ్యం వరుసగా 32 శాతం, 35 శాతం, 37శాతం, 43శాతంగా నమోదయ్యాయని 'నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే' పేర్కొన్నది. 2017నాటి జాతీయ సర్వేతో పోల్చితే, 2021సర్వేలో సగటు ఫలితాలు పడిపోయాయని సర్వే తెలిపింది. తమిళనాడు, తెలంగాణ, మేఘాలయ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో జాతీయ సగటు కన్నా దిగువన ఫలితాలు నమోదయ్యాయి.

ఈనెల 31లోగా జిల్లా కలెక్టర్లు బడిబాట సమన్వయ సమావేశాలు నిర్వహించి కార్యక్రమాలను ప్రణాళిక తయారుచేస్తారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలను ఈ సమావేశాలకు ఆహ్వానిస్తారు. మండల, గ్రామస్థాయి సమావేశాలు జరుగుతాయి. ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్య కమిటీలు ఇంటింటికీ తిరిగి పిల్లలను, తల్లిదండ్రులను కలిసేలా ప్రణాళిక తయారు చేశారు. బాలకార్మికులు, ప్రత్యేక అవసరాలున్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పిస్తారు. 'ప్రభుత్వ పాఠశాలల్లో సరిగ్గా చదువు చెప్పరని, వసతులు ఉండవు' అన్న భావనను తొలగించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులకు ఏ విధంగా అవగాహన కల్పించాలన్న దానిపై నిర్ణయాలు తీసుకోనున్నారు. ఆంగ్ల మాధ్యమం, డిజిటల్ తరగతులు నిర్వహించనున్నారు. బడుల్లో ప్రవేశపెట్టిన ఇంగ్లీష్ మీడియంలో బోధన సదుపాయాలు, రెండు భాషల్లో ముద్రించిన పాఠ్యపుస్తకాలపై తల్లిదండ్రుల్లో అవగాహన పెంచుతారు. బాలికలకు ఉపకార వేతనాలు, కరాటే వంటి ఆత్మరక్షణ శిక్షణలు సంబంధించిన విషయాలపై చర్చిస్తారు.

డా. ముచ్చుకోట సురేష్ బాబు
ప్రజాసైన్స్ వేదిక అధ్యక్షులు

నెహ్రూతో మోడీకి పోలికా!

దేవాసిస్ భట్టోపాధ్యాయ

నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రిగా ప్రమాణస్వీకారం చేశారు. ఆయన మూడోసారి నెహ్రూ మాదిరిగానే ప్రధానిగా పరిపాలన చేయనున్నారని, నెహ్రూ అంతటి పాలనాదక్షుడని ఆయన భక్తులు పొగిడేస్తున్నారు. పరిపాలనలో నెహ్రూతో ఏమాత్రం పోల్చదగిన వ్యక్తికాదు. నెహ్రూ రాజనీతిజ్ఞత మోదీలో ఆయన భక్తులకు కనిపిస్తున్నదా? దేశ ప్రజలంతా నెహ్రూ పట్ల ఎంతో గౌరవం చూపారు. నెహ్రూ దేశంలోనూ, ప్రపంచంలోనూ సానుకూలమైన పేరుప్రఖ్యాతులు పొందారు. మోదీ తన పదేళ్ల పాలనా కాలంలో అత్యధికంగా విదేశాలలో తిరిగివచ్చారు. పార్లమెంటుకు హాజరైన కాలం చాలా తక్కువ. ప్రతిపక్ష నాయకులు వేసిన ప్రశ్నలకు జవాబులు ఇచ్చిన దాఖలాలు పెద్దగాలేవు. అదే నెహ్రూ ప్రతిపక్ష నాయకులు వేసిన ప్రశ్నలకు తప్పనిసరిగా జవాబు చెప్పేవారు. తాను చేసిన ప్రసంగాలలో తప్పులు ఉన్నట్లయితే ప్రతిపక్ష నాయకులు ఎత్తిచూపితే సరిచేసుకునేవారు. స్వాతంత్ర్యం వచ్చేనాటికి భారతదేశం పేదదేశం. అనేక పరిశ్రమలను, విద్య, వైద్య వ్యవస్థలను, వ్యవసాయరంగాన్ని అభివృద్ధిమార్గంలో నడిపించేందుకు నెహ్రూ ఎనలేని కృషి చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో నాగార్జునసాగర్‌లాంటి గొప్ప ప్రాజెక్టులను అనేకం నిర్మింపచేశారు. విద్యారంగాన్ని అభివృద్ధిపరిచే దిశలో దిల్లీలో జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయాన్ని స్థాపించారు. ప్రపంచంలో పేరుపొందిన అనేక విద్యాలయాలను, వైద్యశాలలను స్థాపించారు. ప్రభుత్వరంగ బ్యాంకులను ఏర్పాటుచేసి రైతులకు, చిన్నచిన్న వ్యాపారులకు రుణాలు పొందే సదుపాయం కల్పించారు. గత పదేళ్ల కాలంలో మోదీ చెప్పుకోడానికి ఎలాంటి అభివృద్ధి పథకాన్నయినా నెలకొల్పారా? పైగా వ్యవసాయ రంగాన్ని, కార్మికవర్గాన్ని వారు పోరాడి సాధించుకున్న హక్కులను నాశనం చేస్తున్నారు.

మోదీ 2014లో ప్రధానమంత్రిగా పదవీ స్వీకారం చేశారు. ఆనాటినుంచి దేశవ్యాప్తంగా విద్వేషం, అణచివేత చర్యలకు పూనుకున్నారు. నియంతవలె పాలన సాగించారు. అన్ని వ్యవస్థలను తన గుప్పిటపెట్టుకుని మితిమీరిన అక్రమాల పాలన సాగించారు. దేశమంతటా ఏనాడూ నెహ్రూ వలె ప్రజలను అభిమానించిన పరిస్థితులులేవు. బహు భాషా వ్యవస్థలను కొనసాగించలేదు. బహుళత్వాన్ని పాటించలేదు. అన్ని మతాలకు, అన్ని కులాలకు రాజ్యాంగం ఇచ్చిన హక్కులను హరించడానికే ప్రాధన్యత ఇచ్చారు. విద్యారంగాన్ని, వైద్య వ్యవస్థను ప్రైవేటీకరించి పేదవర్గాలు ఉన్నత విద్యను అందుకునేందుకు అవకాశం లేకుండా చేశారు. మితవాద, మతవాద రాజకీయాలను అనుసరించారు. చివరకు రాజ్యాంగాన్నికూడా మార్చివేసి మనువాదాన్ని రాజ్యాంగంగా రూపొందించాలని ఇంతవరకు ప్రయత్నిస్తూనే ఉన్నారు. అంతర్జాతీయంగా సామ్రాజ్యవాద దేశాలతో సన్నిహితంగా మెలుగుతున్నారు. అలీన ఉద్యమాన్ని ప్రోత్సహించి పలస్తీనాకు అండగా నిలవడానికి బదులుగా ఇజ్రాయిల్‌తో స్నేహబంధం ఏర్పరచుకున్నారు. నెహ్రూ పాలనలో పలస్తీనా స్వతంత్రదేశంగా ఎదగడానికి ఎంతగానో కృషిచేశారు. పార్లమెంటును నిర్వహించడంలో ఆదర్శంగా నిలిచారు. చట్టాలను చేసేప్పుడు తప్పనిసరిగా ఉభయసభల్లోనూ సుదీర్ఘంగా చర్చలకు అనుమతించారు. నేడు మోదీ పెద్దగా చర్చలు లేకుండానే కొన్ని అంశాల్లో అసలు చర్చలే జరగకుండా చట్టాలను తీసుకువచ్చారు. సంకుచిత భావజాలంతో మెజారిటీ మతస్థులను తనకు అనుకూలంగా మార్చుకుని 2014 నుంచి రెండుసార్లు ప్రధానిగా అధికారాన్ని నిర్వహిస్తున్నారు. ఏ విషయంలోనూ నెహ్రూతో పోల్చదగిన అవకాశం కనిపించడంలేదు. నెహ్రూ కాలంలో వ్యవసాయరంగం అర్థికవృద్ధిలో ప్రధాన పాత్ర వహించింది. సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలలో నెహ్రూ పాలన పూర్తి భిన్నంగా ఉండేది. నేటి పాలనా వ్యవహారాలు నెహ్రూ నాటి పాలనతో పోల్చే అవకాశమేలేదు. నరేంద్ర మోదీ ఏనాడూ పారదర్శక పాలనను అనుసరించి ఎరుగరు. అన్ని రంగాల గణాంకాలలో వాస్తవాలను ప్రకటించిన సందర్భాలు చాలా తక్కువ. ప్రజలకు ఇన్ని అతి ముఖ్యమైన వాగ్దానాలను కూడా నెరవేర్చిన దాఖలాలు లేవు. ప్రభుత్వరంగ బ్యాంకులను మూసివేసి క్రమంగా అన్ని బ్యాంకులను ప్రైవేటు రంగంలోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్లు గడిచినా మనది ఎక్కువ పేదలున్న దేశంగానే ఉంది.



ఆర్థికవృద్ధి కోసం నెహ్రూ అనేక సవాళ్లను ఎదుర్కొన్నారు. తృతీయ ప్రపంచ దేశాలను ఆయన ప్రోత్సహించారు. అలాగే భారతదేశ పురోగమనాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. కొత్తగా స్వాతంత్ర్యం పొందిన దేశానికి మౌలిక సదుపాయాల వృద్ధికి ఎంతగానో కృషిచేశారు. గత పదేళ్లకాలంలో మోదీ తన గురించి గొప్పగా చెప్పుకునేందుకు ప్రాధాన్యత నిచ్చారు. స్వాతంత్ర్యపోరాట చరిత్రకలిగిన నెహ్రూ, కమ్యూనిస్టులను మోదీ ద్వేషించడానికే పూనుకున్నారు. చివరికి స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం వహించిన గాంధీ మహాత్ముడుని కూడా వదిలిపెట్టలేదు. ఆయనపై సినిమా వచ్చిన తర్వాతనే ఆయన ప్రపంచానికి తెలుసునన్నట్లుగా మోదీ మాట్లాడారు. విద్యా వ్యవస్థను పూర్తిగా మార్చివేసి మనువాదంతో కూడిన పాఠ్యాంశాలను ప్రవేశపెట్టాలన్నది బీజేపీ, దాని మాతృసంస్థ అయిన ఆర్ఎస్ఎస్ లక్ష్యం. ప్రథమ ప్రధాని నెహ్రూ మరణించి 60ఏళ్లు గడచిన తర్వాత ఇప్పటి ప్రధాని మోదీ అనేక విషయాలలో నెహ్రూ ప్రతిష్ఠను దిగజార్చేందుకు ప్రయత్నిస్తున్నారు.

మూడవసారి ప్రధానిగా బాధ్యతలు తీసుకున్న మోదీ ఇకపై ఎలా పాలిస్తారో చూడవలసిఉంది. నెహ్రూ ఇమేజ్‌ను, నేటికి ప్రజలలో ఆయనపట్ల ఉన్న గౌరవాన్ని, భారత జాతీయ కాంగ్రెస్‌లో గాంధీ, నెహ్రూల పాత్రను మోదీ హేళనచేశారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ శక్తులకు స్వాతంత్ర్యపోరాటంలో ఎలాంటి పాత్ర లేదు. స్వాతంత్ర్యాన్ని సాధించిన పోరాటయోధులను గురించిగానీ ఆనాటి ఘట్టాలను గురించికానీ మోదీ ఎక్కడా ప్రస్తావించిన దాఖలాలు లేవు. సామాజిక శాస్త్రాలను, సైన్సును ఎంతమాత్రం ప్రోత్సహించకుండా పుక్కిటి పురాణాలను, జ్యోతిష్యాలను విద్యార్థులకు బోధించడానికి అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. మైనారిటీ మతస్థులైన ముస్లింలను ద్వేషించడమే ప్రధానం లక్ష్యంగా పెట్టుకున్నారు. ముస్లింలను ద్వితీయశ్రేణి పౌరులుగా మార్చేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నారు. సర్దార్‌పటేల్‌ను తమ వాడిగా చేసుకుని తమకు కూడా స్వాతంత్ర్యపోరాటంలో పాత్ర ఉందని చెప్పుకునేందుకు మోదీ ప్రయత్నిస్తున్నారు. అందుకనే పటేల్ విగ్రహాన్ని నిర్మించి అదొక యాత్రా కేంద్రంగా మార్చారు. రాజ్యాంగ ప్రతిపత్తికలిగిన ఎన్నికల కమిషన్‌ను, సీబీఐ, ఈడీ తదితర దర్యాప్తు సంస్థలను తన గుప్పిట పెట్టుకుని తనను విమర్శించినవారిని, అసమ్మతి తెలిపిన వారిని అరెస్టు చేయించి వేధిస్తున్నారు. చివరకు మీడియా స్వేచ్ఛ కూడా లేకుండా పాలిస్తున్నారు. నెహ్రూ పాలనాకాలంలో మీడియా స్వేచ్ఛకు ఎలాంటి ఆటంకాలు లేవు. రాజ్యాంగ వ్యవస్థలన్నీ స్వతంత్రంగా పనిచేశాయి. నెహ్రూ వారసులను ప్రస్తావించి అది వంశపారంపర్య కుటుంబ ప్రభుత్వమని మోదీ విమర్శిస్తున్నారు. ఈ నేపథ్యంలో నెహ్రూతో మోదీని పోల్చడానికి ఏమాత్రం అవకాశంలేదు.

నాజీలకు నమూనా బిస్మార్క్

సంగిరెడ్డి హనుమంతరెడ్డి

బిస్మార్క్ 1.4.1815న ప్రష్యా(ఉత్తర ఐరోపా ప్రాంతం)లోని షాన్‌హౌసెన్‌లో భూస్వామ్య కుటుంబంలో జన్మించాడు. తండ్రి ఫెర్డినాండ్ వాన్ బిస్మార్క్ తల్లి విల్హెల్మైన్ మెన్‌కెన్ విద్యావంతుల, ఉన్నతాధికారుల కుటుంబం నుంచి వచ్చారు. న్యాయశాస్త్రం చదివిన బిస్మార్క్ 1838లో సైన్యంలో తప్పనిసరి సైనికునిగా చేరి సైన్యాధికారి అయ్యాడు. తల్లి మరణంతో సంస్థాన నిర్వహణకు షాన్‌హౌసెన్ చేరాడు.

బిస్మార్క్ 1860-1890ల మధ్య యూరప్ రాజకీయాల్లో ఆధిపత్య సంప్రదాయబద్ధ ప్రష్యన్ రాజ నీతిజ్ఞుడు, దౌత్యవేత్త. 32 ఏళ్లకు చట్టసభకు ఎన్నికయ్యాడు. వాక్చాతుర్య వాదనలతో సమర్థక రాజకీయునిగా ఎదిగాడు. రాచరికం రాజు దైవహక్కన్నాడు. ఉదారవాదులకు రాయితీలిచ్చాడు. విప్లవ వర్ణ వస్త్రాలను ధరించేవాడు. రాజ్యాంగ రచనకు హామీ ఇచ్చాడు. 1849 లో పార్లమెంటు దిగువసభకు ఎన్నికయ్యాడు. ప్రష్యా స్వతంత్రతకు దెబ్బని జర్మన్ ఐక్యతను వ్యతిరేకించాడు. ప్రష్యన్ రాజు మొదటి విల్హెల్మ్, బిస్మార్క్‌ను రష్యా, ఫ్రాన్సుల రాయబారిగా, 1862లో ప్రష్యా ప్రధానిగా, విదేశాంగమంత్రిగా నియమించాడు. 1890 వరకూ బిస్మార్క్ ప్రధానిగా కొనసాగాడు. ఆయన రాజకీయ, దౌత్య విధానాలు ఆదర్శ నైతికాలు కావు. పితృస్వామ్య, నిరంకుశ భావజాలంతో స్వీయభవిష్యత్తు దురాశతో దూషణ, దురాలోచనల చర్యలతో ఉండేవి. పరిష్కారాలు వాస్తవికతపై కాక అసత్యాలు, అతిశయోక్తులు, ఊహాకల్పనలపై ఆధారపడేవి. నిరంకుశ ఉక్కు ఛాన్సలర్‌గా బిస్మార్క్ పేరుమోశాడు.

డెన్మార్క్, ఆస్ట్రియా, ఫ్రాన్స్‌లతో నిర్ణయాత్మక యుద్ధాలకు కారణమయ్యాడు. ఆస్ట్రియాపై విజయంతో వివిధజాతుల జర్మన్ కాన్ఫెడరేషన్‌ను రద్దుచేసి, జాతీయ రాజ్యంగా 1867లో ఉత్తర జర్మన్ సమాఖ్యను నిర్మించాడు. ఫెడరల్ ఛాన్సలర్ అయ్యాడు. ఉత్తర జర్మన్ రాజ్యాలను ప్రష్యా వైపు తిప్పాడు. దక్షిణ జర్మన్ రాజ్యాల మద్దతుతో 1871లో ఐక్య జర్మన్ సామ్రాజ్యాన్ని ఏర్పరిచి దాని తొలి సామ్రాజ్యవాద ఛాన్సలర్‌గా 1890 వరకు కొనసాగాడు. అదే సమయంలో ప్రష్యాపై ఆధిపత్యాన్ని కొనసాగించాడు. 1863 ఎన్నికల్లో బిస్మార్క్ పార్టీ ఓడిపోయింది. జర్మన్ ప్రోగ్రెస్ పార్టీ మూడింటరెండొంతుల ఆధిక్యత సాధించింది. అంతర్జాతీయ సంబంధాల్లో విదేశాల సైనికబలాన్ని అడ్డుకొని తన ఉనికిని కాపాడుకునే చర్యను అధికార సమతుల్యత సూత్రం అంటారు. బిస్మార్క్ నేటి ఫ్రాన్స్‌లోఉన్న పూర్వ జర్మన్ సామ్రాజ్య ప్రాంతం అల్సేక్-లొరైన్ ను ఆక్రమించి ఫ్రెంచ్ జాతీయవాదానికి, జర్మన్ ఫోబియాకు ఊపిరిపోశాడు.

ప్రత్యర్థులైన మధ్యేమార్గ వామపక్ష సోషల్ డెమొక్రాట్లను అణచడానికి బిస్మార్క్ సంక్షేమ రాజ్యాన్ని నిర్మించాడు. 1870ల్లో తనను పన్నుల, క్యాథలిక్ ఉదారవాద వ్యతిరేకిగా ప్రకటించుకున్నాడు. చర్చితో సాంస్కృతిక పోరాటం చేశాడు. క్యాథలిక్కులు జర్మన్సెంటర్ పార్టీని స్థాపించారు. ఇది క్రైస్తవ ప్రజాస్వామ్య పార్టీగా పనిచేసింది. ఎక్కువ సీట్లు పొందడానికి సార్వజనిక పురుష ఓటు హక్కునిచ్చింది. బిస్మార్క్ సాంస్కృతిక పోరాటాన్ని ఆపాడు. ఉదారవాదులతో సంబంధాలను తెంచుకున్నాడు. ప్రష్యన్ బహిష్కరణల చట్టం చేశాడు. (ఉమ్మడి చరిత్ర, సంస్కృతి, జాతి, భాషలతో పోలండ్లుగా పేరుబడ్డ పశ్చిమ స్లావిక్ దేశాలైన పోలండ్, జెక్, స్లోవిక్, సోర్బియా ప్రజల బహిష్కరణ) సోషలిస్టులను ఎదుర్కోడానికి సెంటర్ పార్టీతో పొత్తుపెట్టుకున్నాడు. జర్మన్ పార్లమెంటు దిగువసభలో ఆధిక్యత సాధించాడు. ప్రజాస్వామ్యాన్ని అవహేళనచేశాడు. నిరంకుశత్వంగా ప్రష్యన్ భూస్వామ్య పద్ధతుల్లో పాలించాడు.

1873లో జర్మని, ఇతర ఐరోపా దేశాలు దీర్ఘ ఆర్థిక మాంద్యాన్ని ఎదుర్కొన్నాయి. జర్మన్ ఆర్థికవ్యవస్థ చితికిపోయింది. బిస్మార్క్ స్వేచ్ఛా వాణిజ్యాన్ని నిషేధించాడు. దిగుమతి పన్నులను విధించాడు. స్వేచ్ఛా వాణిజ్యాన్ని కోరిన ఉదారవాద పార్టీలు మద్దతును ఉపసంహరించాయి. బిస్మార్క్ మతవాద పార్టీల మద్దతు కూడగట్టాడు. ప్రజలను భాషా ప్రయుక్త తెగలుగా చీల్చాడు. పోలండ్‌లను ద్వేషించాడు. వారిని రైతుకూలీలుగా కూడా తీసుకోలేదు. రాజకీయాల్లో మేధావులను అడ్డుకున్నాడు. "జీవితంపై ఆశ వదులుకునేంతవరకు పోలండ్‌లను కొట్టండి. మనం బతకాలంటే వారి నిర్మూలించాలి. దేవుడు వాళ్ళను తోడేళ్ళుగా పుట్టించాడు. మనం కాల్చిపారేద్దాం." అని రాశాడు. తర్వాత బిస్మార్క్ పోలండ్ పట్లయుద్ధాన్ని ప్రకటించాడు. ప్రష్యా విదేశాంగమంత్రికి ఇలా రాశాడు. "పోలండ్ జాతీయఉద్యమ ప్రతి విజయం ప్రష్యాకు ఓటమి. పౌర న్యాయ నియమాల ప్రకారం పోలండ్‌లపై పోరాటాన్ని సాగించలేం. యుద్ధ సూత్రాలతో మాత్రమే ఆ పని చేయగలం." పెరిగిన అంతర్జాతీయ సోషలిస్టు ఉద్యమాన్ని, అహింసాత్మక జర్మన్ సోషల్ డెమొక్రాటిక్ పార్టీ (ఎస్.డి.పి.)ని బిస్మార్క్ జాగ్రత్తగా గమనించాడు. హెచ్చరిక చేశాడు. ఎస్.డి.పి. మనుగడను రాజ్యాంగం రక్షిస్తోంది. రాజ్యాంగాన్ని బలహీనపర్చే మార్గాలను బిస్మార్క్ కనుగొన్నాడు. 1878లో సోషలిస్టు అణచివేత చట్టాలు చేశాడు. సోషలిస్టు సంస్థలను, సమావేశాలను, కార్మిక సంఘాలను, పత్రికలను సాహిత్యాన్ని నిషేధించాడు. ఎస్.డి.పి. ఎన్నికల్లో పాల్గొంది. బిస్మార్క్ ఎస్.డి.పి. సభ్యులను, నాయకులను అడ్డుకోడానికి, వెదికి అరెస్టు చేయడానికి పోలీసులకు అధికారాలిచ్చాడు. పోలీసులు వీరిపై కోర్టుల్లో అనేక కేసులు పెట్టారు. సోషలిస్టులు స్వతంత్రులుగా పోటీ చేశారు. అయినా అణచివేతల కారణంగా ఎస్.డి.పి.కి మద్దతు, పార్లమెంటులో సీట్లు పెరిగాయి.

బిస్మార్క్ 1880ల్లో సంక్షేమ కార్యక్రమాలతో కార్మికులను తనవైపు తిప్పుకునే ప్రయత్నంచేశాడు. ప్రమాద, వృద్ధాప్య బీమాలు, సామాజిక వైద్యం, సామ్యవాద సంస్కరణలు వాటిలో కొన్ని. "నిస్సహాయ ప్రజల రక్షణ బాధ్యత రాజ్యానిదే. అది ఆచరణాత్మక క్రైస్తవ మాటల్లో కాక రాజ్య సహజ బాధ్యత కావాలి. జాతీయ రక్షణ, ప్రయాణ సౌకర్యాలు, బాధితుల సహాయం రాజ్య గమ్యాలు కావాలి. ఈ అంశాలు సోషల్ డెమొక్రాట్ల దోపిడీని పెంచుతాయి." అని బిస్మార్క్ తన కార్మికుల పరిహారచట్టంపై పార్లమెంటులో 1884 మార్చి 15న వ్యాఖ్యానించారు. "ఉద్యోగ అభద్రత, అనారోగ్యం, వృద్ధాప్యం, పేదరికం శ్రామికుని బాధలు. పనిపట్ల ఆయన శ్రద్ధాసక్తులను సమాజం పట్టించుకోదు. శ్రామికులకు, ప్రత్యేకించి నగరాల్లో, చేయాల్సింది చాలా ఉంది" ఇలా సాగాయి బిస్మార్క్ సందేశాలు. వ్యూహాలు ఎన్నిపన్నినా సోషలిజం అణచివేతలో బిస్మార్క్ పూర్తి సఫలంకాలేదు. ఎన్నికల్లో క్రమేపీ ఎస్.డి.పి.కి మద్దతు పెరిగింది.

బిస్మార్క్ చట్టాల్లో పనిస్థలాల్లో భద్రత, మెరుగైన పనిపరిస్థితులు, పనిగంటల తగ్గింపు, స్త్రీ శిశు శ్రమదోపిడి క్రమబద్ధీకరణ, పెన్షన్లు, వికలాంగ బీమాలు లేవు. ఇవి ఉత్పత్తిని తగ్గించి యజమానికి నష్టం కలిగిస్తాయని, ఆర్థిక వ్యవస్థకు అపాయకరమని బిస్మార్క్ అభిప్రాయం. బిస్మార్క్సంప్రదాయవాది. రాయితీలకు వ్యతిరేకి. విప్లవకారులతో చర్చలకు రాజాజ్ఞను ధిక్కరించాడు. సంపన్నులు విద్యావంతులను మాత్రమే గుర్తించాడు. ప్రష్యన్లలో రైతులు, చేతివృత్తులవారు ఎక్కువ. బిస్మార్క్ దృష్టిలో వీరు రాచరికవాదులు. వ్యూహాత్మక, అవకాశవాద ఆలోచన బిస్మార్క్‌ను సైద్ధాంతిక వాదులనుండి దూరం చేసింది. ఆయన విధేయులకే మేళ్లు చేస్తారు. బిస్మార్క్ జర్మన్ జాతీయవాదులకు వీరుడు. వాళ్ళు ఆయనకు స్మారకాలు కట్టారు. చమత్కార దౌత్యంతో ఐరోపాలో శాంతిని స్థిరీకరించిన దార్శనికుడని పొగిడారు. పోలండ్‌లను, క్యాథలిక్కులను పీడించాడని, అధికార కేంద్రీకరణతో నియంతగా మారాడని విమర్శకుల అభిప్రాయం. బిస్మార్క్ సృష్టించిన జర్మని జాతీయవాదం రెండు ప్రపంచ యుద్ధాలకు కారణమయింది. బిస్మార్క్‌తో తృప్తిచెందని రాజు రెండవ విల్హెల్మ్బిస్మార్క్‌ను 1890లో అధికారం నుంచి తొలగించాడు. అధికారంలేని బిస్మార్క్ తన జ్ఞాపకాలను రాశాడు. రాజును విమర్శించాడు. తనను, తన పాలనను పొగుడుకున్నాడు. బిస్మార్క్ రాచపుండుతో హాంబర్గ్ సమీపంలో ఫ్రెడ్రిచ్‌స్రూలో 1898 జులై 30న మరణించాడు. బిస్మార్క్ నియంతృత్వాన్ని, ద్వేషాన్ని, జాతీయవాద కుట్రలను, తూట్ల మాటలను నాజీలు ఆచరించారు.

ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి,
సెల్: 9490 20 4545

ఇజ్రాయిల్ సైన్యం ముందుకొస్తే బందీలు హతం: హమాస్

గాజా: గాజాలో ఉద్రిక్త పోరు కొనసాగుతోంది. ఇటీవల హమాస్ చెరలో ఉన్న నలుగురు బందీలను విడిపించేందుకు ఇజ్రాయిల్ నిర్వహించిన దాడుల్లో స్థానికంగా భారీ ప్రాణనష్టం సంభవించింది. దీంతో హమాస్ నుంచి తీవ్ర హెచ్చరిక వచ్చినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. టెల్అవీవ్ దళాలు ముందుకు చొచ్చుకొని వస్తున్నాయని భావిస్తే...బందీలను కాల్చివేయాలని తమ దళాలకు అగ్రనేతల నుంచి ఆదేశాలు వచ్చినట్లు సమాచారం. గత ఏడాది అక్టోబరులో హమాస్ ఉగ్రవాదులు ఇజ్రాయిల్‌పై మెరుపుదాడి చేశారు. దాదాపు 250 మందిని కిడ్నాప్ చేసి గాజాకు తరలించారు. నవంబరులో రెండు పక్షాల నడుమ కాల్పుల విరమణ సమయంలో కొంతమందిని విడిచిపెట్టారు. ఇంకా 120 మంది హమాస్ చెరలో ఉన్నారని ఇజ్రాయిల్ చెబుతోంది. వారిని గాజాలోని జనసమ్మర్ద ప్రదేశాలు, సొరంగాల్లో ఉంచినట్లు సమాచారం. దీంతో... వారిని కాపాడటం టెల్అవీవ్‌కు సవాల్‌గా మారుతోంది. వారిని గుర్తించేందుకు డ్రోన్లు, శాటిలైట్లుతో ఇజ్రాయిల్, అమెరికా నిఘా విభాగాలు, మిలిటరీ నిరంతర ప్రయత్నాలు కొనసాగిస్తున్నాయి. గాజాలో కాల్పుల విరమణ, బందీల విడుదలకు పిలుపునిస్తూ అమెరికా ప్రతిపాదించిన తీర్మానాన్ని ఐరాస భద్రతామండలి ఆమోదించింది. 14 ఓట్లు అనుకూలంగా రాగా... రష్యా ఓటింగ్‌కు దూరంగా ఉంది. ఈ సంధి ప్రణాళికకు ఇజ్రాయిల్ అంగీకరించింది.

అయితే హమాస్ నుంచి అంగీకారం రావాల్సి ఉంది. తాము గాజాలో కాల్పుల విరమణకు సిద్ధంగా ఉన్నామని ఇప్పటికే హమాస్ వెల్లడించింది. ఈ ఘర్షణకు శాశ్వత ముగింపు ఉండాలని షరతు విధించింది. దీనిని బెంజిమిన్ నెతన్యాహు ప్రభుత్వం తిరస్కరిస్తోంది. ఇదిలా ఉంటే... ఇటీవల బందీలను విడిపించేందుకు చేసిన ఆపరేషన్ వీడియోలను ఇజ్రాయిల్ మిలిటరీ విడుదల చేసింది.

'స్పేస్ బగ్'తో వ్యోమగాములకు కష్టాలు

వాషింగ్టన్: భారత సంతతికి చెందిన వ్యోమగామి సునీతా విలియమ్స్ (59) మూడోసారి అంతరిక్షంలోకి వెళ్లారు. బోయింగ్ స్టార్‌లైనర్ అంతరిక్ష నౌక ద్వారా మరో వ్యోమగామి బుచ్ విల్మోర్‌తో సురక్షితంగా అంతరిక్ష కేంద్రం (ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్)కు చేరుకున్నారు. అంతరిక్ష కేంద్రంలో ఉన్న సునీతా విలియమ్స్‌తో సహా 8 మంది సిబ్బందికి 'స్పేస్ బగ్' రూపంలో ఇబ్బంది వచ్చిపడింది. సునీతా విలియమ్స్‌తో పాటు మరో ఆస్ట్రోనాట్ బారీ యూజీన్ బుచ్ విల్మోర్ జూన్ 6న అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి చేరుకున్న విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సునీత డ్యాన్స్ చేసి తన ఆనందాన్ని కూడా వ్యక్తం చేశారు. అయితే వారు వారం రోజుల పాటు అంతరిక్ష కేంద్రంలో ఉండి.. అనంతరం భూమిపైకి తిరిగి రానున్నారు. కాగా, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో సూపర్ బగ్‌గా పిలిచే 'ఎంటర్‌బాక్టర్ బుగాన్‌డెన్సిస్' అనే బాక్టీరియా ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. అంతరిక్ష వాతావరణంలో ఈ బ్యాక్టీరియా మరింత బలం పెంచుకుంటోందని తెలిపారు. ఇది అనేక ఔషధాలను నిరోధించగలిగే శక్తివంతమైనదని వివరించారు. ఈ బ్యాక్టీరియా మల్టీ డ్రగ్ రెసిస్టెంట్ కావడం వల్ల దీన్ని 'సూపర్ బగ్'గా పిలుస్తారని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ బాక్టీరియా శ్వాసకోశ వ్యవస్థపై ప్రభావం చూపిస్తుందని శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ స్పేస్ బగ్‌తో అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో ఉన్న సునీతా విలియమ్స్ సహా మిగిలిన ఎనిమిది మంది సిబ్బంది ఇబ్బందుల్లో పడనున్నట్లు తెలుస్తోంది. సాధారణంగా అంతరిక్ష కేంద్రం... కదిలే అంతరిక్ష శిథిలాల వల్ల ఆందోళన వ్యక్తం చేస్తుంది. అయితే ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే 'స్పేస్ బగ్' బాక్టీరియా కొన్నేళ్ల నుంచి అభివృద్ధి చెందటం మరింత ఆందోళన కలిగిస్తోందని శాస్త్రవేత్తలు అంటున్నారు. వ్యోమగాములు అంతరిక్ష యాత్రల సమయంలో ఆరోగ్యపరంగా సవాళ్లు ఎదుర్కొంటారని పరిశోధకులు అభిప్రాయపడుతున్నారు. ఆస్ట్రోనాట్స్ ఆరోగ్యం కోసం 'స్పేస్ బగ్' ప్రభావాన్ని, ప్రతికూలతలను అంతరిక్ష కేంద్రం త్వరగా అంచనా వేయటం కీలమని పేర్కొంటున్నారు.

కాల్పుల విరమణ తీర్మానం...

ఐరాస భద్రతా మండలి ఆమోదం

ఐరాస: గాజాలో ఇజ్రాయిల్ అమానుష యుద్ధానికి ముగింపు పలికే లక్ష్యంతో కాల్పుల విరమణ ప్రణాళికను ఆమోదించే మొదటి తీర్మానాన్ని ఐరాస భద్రతా మండలి ఆమోదించింది. గత నెలలో అమెరికా ప్రవేశ పెట్టిన ఈ తీర్మానంపై 14-0 ఓటింగ్ నమోదైంది. ఓటింగ్‌కు రష్యా గైర్హాజరైంది. మూడు దశల కాల్పుల విరమణ ప్రతిపాదనను తీర్మానం స్వాగతించింది. ప్రారంభ ఆరువారాల కాల్పుల విరమణతో పాటు ఇజ్రాయిల్ జైళ్లలో ఉన్న పలస్తీనా ఖైదీల కోసం గాజాలో ఉన్న కొంతమంది ఇజ్రాయిల్ బందీలను విడుదల చేయాలని పిలుపునిచ్చింది. రెండవ దశలో శాశ్వత కాల్పుల విరమణ... మిగిలిన బందీల విడుదల ఉంటుంది. మూడవ దశలో విధ్వంసానికి గురైన గాజా స్ట్రిప్ పునర్నిర్మాణ ప్రయత్నం ఉంటుంది. ఇజ్రాయిల్ ఈ తీర్మానాన్ని ఆమోదించినట్లు అమెరికా అధ్యక్షుడు బైడెన్ ప్రకటించారు. ప్రణాళికను ఏవిధంగా అమలు చేయాలనే దానిపై పరోక్షంగా చర్చలు జరపడానికి సోదరులతో కలిసి పనిచేయడానికి హమాస్ సుముఖత వ్యక్తం చేసిందని అమెరికా తెలిపింది. షరతులు, నిబంధనలు లేకుండా తక్షణమే ఈ తీర్మానాన్ని పూర్తిగా అమలు చేయాలని ఇజ్రాయిల్, హమాస్‌లను కోరింది. రంజాన్ సందర్భంగా గాజాలో మానవతావాద కాల్పుల విరమణను డిమాండ్ చేస్తూ మార్చి 25న ఐరాస భద్రతా మండలి తీర్మానాన్ని ఆమోదించిన సంగతి తెలిసిందే. అయితే ఈ తీర్మానంపై ఓటింగ్‌కు అమెరికా దూరంగా ఉంది. అయినప్పటికీ గాజాపై ఇజ్రాయిల్ దాడులు ఆపలేదు.

'నీట్' కౌన్సెలింగ్‌పై స్టే ఇవ్వలేం

(మూడోపేజీ తరువాయి)

ఎన్‌టీఏ తమ సమాధానం తెలియజేయాలని కోర్టు ఆదేశించింది.

ఈ ఏడాది మే 5వ తేదీన నీట్ యూజీ -2024 ప్రవేశ పరీక్ష జరిగింది. జూన్ 4న ఫలితాలు ప్రకటించారు. తొలుత జూన్ 14న ఫలితాలు వెల్లడిస్తామని చెప్పి... అంతకంటే ముందే ఓట్ల లెక్కింపు జరుగుతుండగా విడుదల చేయడం వివాదానికి దారితీసింది. ఈ ఫలితాల్లో 67 మంది విద్యార్థులకు ఆలిండియా మొదటి ర్యాంక్ రాగా, వారిలో ఒకే పరీక్ష కేంద్రానికి చెందిన ఆరుగురు విద్యార్థులకు 720కి 720 మార్కులు రావడం అనుమానాలకు దారితీసింది. ఈ పరీక్షలో పేపర్ లీకేజీ జరిగిందని, ఫలితాల్లోనూ అక్రమాలు చోటుచేసుకున్నాయని కాంగ్రెస్ సహా కొన్ని విపక్షాలు ధ్వజమెత్తాయి. దీంతో ఆరోపణలపై విచారణకు యూపీఎస్సీ మాజీ చైర్మన్ సారథ్యంలో నలుగురు సభ్యులతో కమిటీ వేయాలని కేంద్రం నిర్ణయించింది. ఈ క్రమంలోనే దీనిపై సుప్రీంకోర్టులో పెద్దఎత్తున పిటిషన్లు దాఖలయ్యాయి.

కుప్పకూలిన విమానం

(మూడోపేజీ తరువాయి)

అంతర్జాతీయ విమానాశ్రయంలో దిగాల్సి ఉంది. ప్రయాణ సమయం 45 నిమిషాలు. అయితే, ప్రతికూల వాతావరణం కారణంగా అక్కడ దిగవద్దని, తిరిగి లిలోంగ్వేకు వెళ్లిపోవాలని ఏటీసీ సూచించింది. ఈ క్రమంలోనే రాడార్‌తో విమానం సంబంధాలు తెగిపోయాయి. గల్లంతైన విమానం కోసం మలావీ సైన్యం గాలింపు చర్యలు చేపట్టింది. ప్రతికూల వాతావరణం ఉన్నప్పటికీ వందల మంది సైనికులు, పోలీసులు, అటవీ అధికారులతో ముమ్మరంగా గాలించింది. పొరుగు దేశాల హెలికాప్టర్లు, డ్రోన్లను రంగంలోకి దించింది. అంగోలా దేశ అంతరిక్ష కేంద్రం సహాయం కోరింది. అమెరికా, బ్రిటన్, నార్వే, ఇజ్రాయిల్ కూడా సహాయం అందించేందుకు ముందుకువచ్చాయని మలావీ ప్రభుత్వం వెల్లడించింది. ఈ క్రమంలోనే కూలిపోయిన విమాన శకలాలను గుర్తించినట్లు తెలిపింది.

ఒడిశా కొత్త సీఎంగా మాఝీ

(మూడోపేజీ తరువాయి)

బీజేపీ శాసనసభా పక్ష నాయకుడిగా మోహన్ చరణ్ మాఝీ ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు ప్రకటించడం ఆనందంగా ఉంది. ఆయన రాష్ట్రాన్ని ముందుకు తీసుకువెళుతున్న యువ, డైనమిక్ పార్టీ కార్యకర్త. ఒడిశా కొత్త ముఖ్యమంత్రిగా పురోగతికి, శ్రేయస్సుకు మార్గం. కొత్త రాష్ట్ర ప్రభుత్వానికి సారథ్యం వహించేందుకు ఇద్దరు ఉప ముఖ్యమంత్రులను నియమించాలని నిర్ణయించారు. కనక వర్ధన్ సింగ్ దేవ్, ప్రవతి పరిదా ఉప ముఖ్యమంత్రిగా రాష్ట్రానికి సేవ చేస్తారు. వారికి అభినందనలు!' అని రాజ్‌నాథ్ సింగ్ 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొన్నారు. ముఖ్యమంత్రిగా ఎన్నికయిన తర్వాత మాఝీ మీడియాతో మాట్లాడుతూ 24 ఏళ్ల ప్రభుత్వం మారిపోయిందని, ప్రజలు తమ కలల సాకారం కోసం, అభివృద్ధి కోసం బీజేపీపై చూపిన నమ్మకాన్ని నెరవేర్చేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు. ఒడిశాను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దుతానని వాగ్దానం చేస్తున్నానన్నారు. అంతకుముందు ఒడిశా ముఖ్యమంత్రిని ఎంపిక చేసేందుకు బీజేపీ శాసనసభా పక్షం సమావేశం జరిగింది. రాజ్‌నాథ్ సింగ్, ఆయన మంత్రివర్గ సహచరుడు భూపేందర్ యాదవ్ హాజరయ్యారు. మోహన్ చరణ్ మాఝీ కియోంజర్ అసెంబ్లీ స్థానం నుంచి 87 వేల ఓట్ల తేడాతో గెలుపొందారు. బిజూ జనతాదళ్‌కు చెందిన మినా మాఝీ, కాంగ్రెస్ అభ్యర్థి ప్రతివా మంజరీ నాయక్‌పై ఆయన విజయం సాధించారు. బీజేపీ వర్గాల సమాచారం ప్రకారం, జూన్ 12 సాయంత్రం 5 గంటలకు మాఝీ, ఇతర నాయకుల ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగే అవకాశం ఉంది. ప్రధాని నరేంద్ర మోదీ బుధవారం మధ్యాహ్నం 2.30 గంటలకు భువనేశ్వర్‌కు చేరుకుని విమానాశ్రయం నుంచి రాజ్‌భవన్‌కు వెళ్లే అవకాశం ఉందని పార్టీ వర్గాలు తెలిపాయి. కేంద్ర మంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో సహా అనేక మంది ప్రముఖులు ఒడిశా కొత్త ముఖ్యమంత్రి, ఇతర మంత్రుల ప్రమాణ స్వీకార కార్యక్రమానికి హాజరుకానున్నారు.

గవర్నర్‌తో చంద్రబాబు భేటీ

ప్రభుత్వ ఏర్పాటుకు రాజ్‌భవన్ నుంచి ఆహ్వానం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేయడానికి జరగాల్సిన ప్రక్రియ పూర్తయింది. ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్‌తో చంద్రబాబు నాయుడు మంగళవారం విజయవాడలోని రాజ్‌భవన్‌లో భేటీ అయ్యారు. రాష్ట్రంలో నూతన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని చంద్రబాబును గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆహ్వానించారు. ఆ క్రమంలో తనకు మద్దతు ఇచ్చిన 163 మంది ఎమ్మెల్యేల జాబితాను గవర్నర్‌కు చంద్రబాబు అందజేశారు. భేటీ అనంతరం రాజ్‌భవన్ నుంచి చంద్రబాబు ఉండవల్లి నివాసానికి బయలుదేరి వెళ్లారు. దీనికంటే ముందుగా రాజ్‌భవన్‌లో గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ఎన్డీయే నేతలు కలిశారు. టీడీపీ తరపున రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు దగ్గుబాటి పురందేశ్వరి, జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ గవర్నర్‌ను కలిసి... సభా నాయకుడిగా చంద్రబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్న తీర్మానాన్ని గవర్నర్‌కు అందజేశారు. చంద్రబాబుకు 164 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందని, రాష్ట్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని గవర్నర్‌కు లేఖ ఇచ్చారు. ఈ తీర్మానాన్ని పరిశీలించిన గవర్నర్... ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని చంద్రబాబుకు రాజ్యాంగపరంగా రాజ్‌భవన్ నుంచి ఆహ్వానం అందింది. ఆ తర్వాత చంద్రబాబు రాజ్‌భవన్‌కు వచ్చి గవర్నర్‌తో భేటీ అయ్యారు.

సింగరేణి కారుణ్య నియామకాలు

గరిష్ఠ వయోపరిమితి 40 ఏళ్లు

• యాజమాన్యం కీలక నిర్ణయం • కార్మికుల హర్షాతిరేకం

విశాలాంధ్ర-హైదరాబాద్: సింగరేణిలో కారుణ్య ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థుల వయో పరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచుతూ సింగరేణి యాజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేసినట్లు సంస్థ చైర్మన్, ఎండీ ఎన్.బలరామ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దాదాపు దశాబ్ద కాలంగా వయో పరిమితి నిబంధన వల్ల వందలాది మంది అభ్యర్థులు ఉద్యోగావకాశాలను అందుకోలేకపోయారని, సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ అంశంపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని ఇటీవల హైదరాబాద్ అంబేద్కర్ విగ్రహ ప్రాంగణంలో బదిలీ వర్కర్లకు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు ఇస్తున్న సమయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి సూచించారన్నారు. ఈ విషయంపై సమగ్రంగా చర్చించి సింగరేణి బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశంలో ఒప్పించి సానుకూల నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. 2018 మార్చి 9వ తేదీ నుండి ఈ గరిష్ట వయోపరిమితి సడలింపు స్కీంను వర్తింపజేస్తున్నామని తెలియజేశారు. దీనివల్ల 2018 నుంచి ఉద్యోగం కోసం ఎదురు చూస్తున్న దాదాపు 300 మందికి తక్షణమే ప్రయోజనం చేకూరనుందన్నారు. అలాగే రానున్న రోజుల్లోనూ మరింత మందికి లబ్ధి చేకూరుతుందన్నారు. గరిష్ట వయో పరిమితి దాటిన వాళ్లు సింగరేణిలో ఉద్యోగం పొందడం కోసం నకిలీ ధ్రువీకరణ పత్రాలతో తప్పుడు మార్గాలను ఆశ్రయిస్తున్నారని... దాని వల్ల విజిలెన్స్ కేసులను ఎదుర్కోవడంతోపాటు వారికి వచ్చే అన్ని ప్రయోజనాలను కోల్పోతున్నారని... వయో పరిమితి పెంపు వల్ల తప్పుడు మార్గాలను ఆశ్రయించబోరని పేర్కొన్నారు.

పూర్తి వివరాలు ఈ విధంగా ఉన్నాయి...

సింగరేణి సంస్థలో పనిచేస్తూ ఎవరైనా కార్మికుడు లేదా ఉద్యోగి మృతి చెందినట్లయితే ఆయన స్థానంలో అతని వారసుల్లో ఒకరికి ఉద్యోగం ఇస్తారు. అలాగే అనారోగ్య కారణాల రీత్యా ఉద్యోగానికి అనర్హులుగా మెడికల్ బోర్డు ప్రకటించిన కార్మికుల వారసులకు కూడా సింగరేణి సంస్థ బదిలీ వర్కర్‌గా ఉద్యోగాల్లోకి తీసుకుంటుంది. అయితే ఈ రెండు విభాగాల్లోనూ వారసుల కనిష్ఠ వయసు 18 సంవత్సరాలుగాను గరిష్ఠ వయసు 35 సంవత్సరాలుగా నిర్ధారించారు. కరోనా సమయంలో దాదాపు రెండేళ్లపాటు మెడికల్ బోర్డు నిర్వహించని కారణంగా కొంతమంది వారసులు గరిష్ఠ వయోపరిమితిని దాటిపోవడం జరిగింది. ఈ నేపథ్యంలో కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు డిపెండెంట్ ఉద్యోగాలకు గరిష్ఠ వయోపరిమితిని 35 ఏళ్ల నుండి 40 ఏళ్లకు పెంచాలని ఎంతో కాలంగా యాజమాన్యానికి మొరపెట్టుకున్నారు.

ప్రతి అడుగు ప్రజలకోసమే

(మూడోపేజీ తరువాయి)

ప్రజలు చొరవ చూపారు. ప్రజలు గెలవాలి..రాష్ట్రం నిలవాలి అనేది మన లక్ష్యమని ఎన్నికల ముందు ప్రచారం చేశాం. ప్రజలు గెలిచారు...రాష్ట్రాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరిపై ఉందని చంద్రబాబు అన్నారు. 45 ఏళ్ల తన రాజకీయ జీవితంలో రాగద్వేషాలకు అతీతంగా పని చేశానని, ప్రజల కోసం కష్టపడటం, ప్రజాహితమే తనకు తెలుసునని చెప్పారు. ప్రజల నమ్మకాన్ని నిలబెడతానని హామీ ఇచ్చారు. జగన్ ప్రవర్తన చూశాక ఇలాంటి వ్యక్తి పాలనకు పనికి రాడని ప్రజలు నిర్ణయించుకుని తీర్పునిచ్చారన్నారు. పాలన ఎలా ఉండకూడదో గత పాలన ఒక కేస్ స్టడీ అని చంద్రబాబు వివరించారు. తనకు అసెంబ్లీలో అవమానం జరిగిందని, దాన్ని భరించలేక మళ్లీ ముఖ్యమంత్రిగానే అసెంబ్లీలో అడుగుపెడతానని శపథం చేసి బయటకు వచ్చానని గుర్తుచేశారు. అసెంబ్లీని గౌరవసభగా మారుస్తానని చెప్పానని, మనం శాసనసభను గౌరవసభగా మార్చి ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు వేదికగా మార్చుకుందామని చంద్రబాబు పిలుపునిచ్చారు.

కక్షపూరిత రాజకీయాలు కాకుండా నిర్మాణాత్మక రాజకీయాలు చేద్దాం

కక్షపూరిత రాజకీయాలు కాకుండా నిర్మాణాత్మక రాజకీయాలు చేస్తూ, ఏపీని ఆదర్శవంతమైన రాష్ట్రంగా మారుస్తామని చంద్రబాబు అన్నారు. రాష్ట్రానికి ఎంత అప్పు ఉందో తెలీదు. ఎక్కడ నుండి తెచ్చారో తెలీదు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ ఛిన్నాభిన్నమైంది. సాగునీటి వ్యవస్థ నిర్వీర్యం అయింది. ఐదేళ్లలో 9 సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచారు. పదేళ్ల తర్వాత కూడా రాజధాని ఏది అంటే చెప్పుకోలేని పరిస్థితి. వీటన్నింటినీ గాడిన పెట్టాల్సిన పెద్ద బాధ్యత మనపై ఉంది. 72 శాతం పోలవరం పనులు పూర్తి చేస్తే.. నేడు మళ్లీ పరిస్థితి మొదటికి వచ్చింది. డయాఫ్రం వాల్ కొట్టుకుపోయింది. మళ్లీ కేంద్ర సహకారంతో పోలవరం పూర్తి చేసి నదులు అనుసంధానం చేసి ప్రతి ఎకరాకు నీళ్లందిస్తామని చంద్రబాబు అన్నారు. ఏపీకి రాజధానిగా అమరావతే ఉంటుంది. విశాఖను ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చేస్తాం. విశాఖను రాజధానిగా చేస్తామని, ప్రమాణ స్వీకారం అక్కడే చేస్తానని జగన్ చెప్పినా ప్రజలు విశ్వసించలేదన్నారు. న్యాయ రాజధాని కర్నూలు అంటూ మోసం చేశారు. రాయలసీమలో ఏకపక్షంగా ఎన్నికలు జరిగాయి. ఊహించని మెజార్టీని ప్రజలు మనకు ఇచ్చారు. సీఎం వస్తున్నాడంటే చెట్లు కొట్టేయడం, షాపులు బంద్ చేయడం, పరదాలు కట్టడం లాంటివి ఇక ఉండవు. ముఖ్యమంత్రి కూడా మామూలు మనిషే. తాను, పవన్ కల్యాణ్ సామాన్యుల్లా ప్రజల్లో ఒకరిగానే ఉంటాం. హోదా సేవ కోసం తప్ప పెత్తనం కోసం కాదు. తాము బయటకు వచ్చినప్పుడు ప్రజలు ఇబ్బంది పడకూడదన్నది తమ విధానమని చంద్రబాబు స్పష్టం చేశారు.

మేనిఫెస్టో హామీలు బాధ్యతగా అమలు చేయాలి: పవన్

ఉమ్మడి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను బాధ్యతగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని పవన్ కల్యాణ్ అన్నారు. నాలుగు దశాబ్దాల అనుభవం, అభివృద్ధిపై అపారమైన అవగాహన, పెట్టుబడులు తీసుకొచ్చే సమర్థత, ప్రతిభ, విదేశాల అధ్యక్షులను తెలుగు రాష్ట్రాల వైపు దృష్టి మళ్లించే శక్తి ఉన్న చంద్రబాబు నాయకత్వం రాష్ట్రానికి చాలా అవసరమన్నారు. కక్ష సాధింపులకు, వ్యక్తిగత దూషణలకు ఇది సమయం కాదన్నారు. మనందరం సమష్టిగా ప్రభుత్వాన్ని ముందుకు తీసుకెళ్లాలన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలి. సాగునీరు, తాగునీరు, విద్య, వైద్యం, శాంతి భద్రతల విషయంలో బలంగా నిలబడతామని చెప్పాం. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా కృషి చేయాల్సి ఉంది. చంద్రబాబు జైల్లో చాలా నలిగిపోయారు. అప్పుడు చంద్రబాబు సతీమణి భువనేశ్వరి పడిన బాధ చూశాను. మంచిరోజులు వస్తాయి... కన్నీళ్లు పెట్టొద్దని చెప్పాను. ఆ రోజులు వచ్చాయి. చంద్రబాబుకు మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు చెబుతున్నా. అద్భుతమైన పాలన అందివ్వాలని కోరుకుంటున్నాని చెప్పగా... పవన్‌ను చంద్రబాబు ఆలింగనం చేసుకుని ధన్యవాదాలు తెలిపారు.

మూడు పార్టీల కలయిక త్రివేణి సంగమం: పురందేశ్వరి

కూటమి లక్ష్యం ప్రజా సంక్షేమమని, మూడు పార్టీల కలయిక త్రివేణి సంగమం వంటిదని పురందేశ్వరి వ్యాఖ్యానించారు. ప్రజావ్యతిరేక పాలనను అంతమొందించేందుకు ప్రజలు కసిగా ఓట్లు వేశారని ఆమె అన్నారు. కూటమి సాధించిన ఘన విజయం నుంచి పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్నికల విజయానికి కలిసికట్టుగా పనిచేసిన విధంగానే, సుపరిపాలన అందించడంలోనూ సమష్టి నిర్ణయాలతో ముందుకు సాగుతామని పురందేశ్వరి హామీ ఇచ్చారు. .

స్పందించని జగన్ !

(మూడోపేజీ తరువాయి)

అందుబాటులోకి రాలేదని సమాచారం. సార్వత్రిక ఎన్నికల్లో ఓటమి పాలైన జగన్ తన పార్టీ నేతలతో జిల్లాల వారీగా భేటీలు నిర్వహిస్తున్నారు. 2014లోను సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారానికి జగన్ వెళ్లలేదు. 2019లో సీఎంగా జగన్ ప్రమాణ స్వీకారానికి చంద్రబాబు కూడా హాజరు కాలేదు. దీంతో కొత్త ప్రభుత్వ ప్రమాణస్వీకారానికి ప్రతిపక్ష నేతలు హాజరయ్యే ఆనవాయితీ రాష్ట్రంలో కనుమరుగైంది.

సర్వం సిద్ధం

(మూడోపేజీ తరువాయి)

ఆర్డీవోలను కేటాయించారు. అలాగే అతిథులు సేద తీరేందుకు ప్రత్యేక వసతి ఏర్పాట్లు కూడా చేశారు. బయో టాయిలెట్స్ పెద్దసంఖ్యలో ఏర్పాటు చేశారు. వర్షం కురిసినా ఇబ్బంది లేకుండా భారీ గూడారాలను నిర్మించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా చెన్నై-కలకత్తా హైవేపై మంగళవారం అర్ధరాత్రి నుంచి బుధవారం సాయంత్రం 6 గంటల వరకు వాహనాల మళ్లింపు కార్యక్రమం చేపడుతున్నారు. కేవలం పాస్‌లు ఉన్న వారి వాహనాలనే సభా ప్రాంగణం వైపు వెళ్లేందుకు అనుమతిస్తామని పోలీసులు చెబుతున్నారు. నగరంలో వీఐపీలు బసచేసే హోటళ్ల వద్ద ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశామని ఎన్టీఆర్ జిల్లా సీపీ పీహెచ్‌డీ రామకృష్ణ తెలిపారు. ఇప్పటికే రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు విజయవాడ చేరుకున్నారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా మంగళవారం రాత్రికే విజయవాడ చేరుకున్నారు. ఇక ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రత్యక్షంగా హాజరు కాని వారు కూడా లైవ్ ద్వారా వీక్షించేందుకు వీలుగా రాష్ట్రవ్యాప్తంగా అధికారులు స్క్రీన్‌లు ఏర్పాటు చేశారు.

చంద్రబాబు నివాసంలో విందు

చంద్రబాబు ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి విజయవాడ విచ్చేసిన ముఖ్య అతిథులకు మంగళవారం రాత్రి చంద్రబాబు తన నివాసంలో విందు ఏర్పాటు చేశారు. ఈ విందుకు కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా, ఆ శాఖ సహాయ మంత్రి బండి సంజయ్, కేంద్ర మంత్రి జేపీ నడ్డాతో పాటు బీజేపీకి చెందిన కొందరు కీలక నేతలు హాజరయినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.

విమానాశ్రయ పరిసరాల్లో ఆంక్షలు

సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ హాజరవుతున్న నేపథ్యంలో గన్నవరం విమానాశ్రయ పరిసరాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. బుధవారం విమాన ప్రయాణికులు ఉదయం 9.30 గంటల్లోపే చేరుకోవాలని విమానాశ్రయ డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంత రెడ్డి సూచించారు. అయితే ప్రయాణికుల విమానాలేవీ రద్దు చేయలేదని... అన్నీ యథాతథంగా నడుస్తాయని తెలిపారు. విజయవాడ నుంచి హైదరాబాద్, బెంగళూరు, తిరుపతి, షిర్డీ వెళ్లే విమానాలు యథావిధిగా బయల్దేరతాయని చెప్పారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విమానాశ్రయ పరిసరాల్లో ఆంక్షలు అమలులో ఉంటాయన్నారు.

అమ్మాయిల సత్తా

(మూడోపేజీ తరువాయి)

ర్యాంకులను రీజియన్ల వారీగా ఓపెన్, రిజర్వేషన్ల ఆధారంగా ప్రకటించారు. మే 16 నుంచి 25 వరకు ఆంధ్రప్రదేశ్‌తోపాటు హైదరాబాద్‌లో ఏపీ ఈఏపీసెట్ పరీక్షలు నిర్వహించారు. ఇంజినీరింగ్ విభాగంలో గతేడాది కంటే ఉత్తీర్ణత శాతం స్వల్పంగా తగ్గింది. ఈ ప్రవేశ పరీక్షల్లో అర్హత సాధించిన వారంతా వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ విశ్వవిద్యాలయాల్లో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ సీట్లకు కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. ఫలితాలను ఏపీఈఏపీసెట్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. అభ్యర్థులు వారి దరఖాస్తు, హాల్ టికెట్ల నంబర్లు నమోదు చేసుకుని ర్యాంకులు తెలుసుకోవచ్చు.

ఇంజినీరింగ్‌లో టాప్ 10 ర్యాంకర్లు వీరే..

ఇంజినీరింగ్‌లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి టాప్ 10 ర్యాంకులు సాధించిన అభ్యర్థుల వివరాలిలా ఉన్నాయి. మాకినేని జిష్ణుసాయి(గుంటూరుజిల్లా), మరసాని సాయి యశ్వంత్‌రెడ్డి (కర్నూలు), బోగాలపల్లి సందేశ్ (ఆదోని), పాలగిరి సతీశ్‌రెడ్డి (ముక్కరాయసముంద్రం-అనంతపురం), కోమటినేని మనీశ్‌చౌదరి (గుంటూరు), యప్పా లక్ష్మీనరసింహారెడ్డి(సిద్దిపేట-తెలంగాణ), గొల్ల లేఖ హర్ష(కర్నూలు), పుట్టి కుశాల్ కుమార్ (అనంతపురం), పరమాధ్యుల సుశాంత్ (హనుమకొండ-తెలంగాణ), కొమిరిశెట్టి ప్రభాస్ (అక్కపాలెం-ప్రకాశం) మొదటి పది ర్యాంకులు సాధించారు.

అగ్రికల్చర్ విభాగంలో టాప్ 10 ర్యాంకర్లు

అగ్రికల్చర్ విభాగంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రం నుంచి టాప్ 10 ర్యాంకులు సాధించిన అభ్యర్థుల వివరాలిలా ఉన్నాయి. ఎల్లు శ్రీశాంత్‌రెడ్డి(హైదరాబాద్), పూల దివ్యతేజ(తలుపుల-సత్యసాయి), వడ్లపూడి ముకేశ్ చౌదరి (తిరుపతి), పేరా సాత్విక్ (పులిచెర్ల-చిత్తూరు), ఆలూరు ప్రణీత(మదనపల్లె-అన్నమయ్య), గట్టు భానుతేజ సాయి(పాపంపేట-అనంతపురం), పెన్నమాడ నిహారికారెడ్డి(హైదరాబాద్), శంబంగి మనో అభిరామ్ (గాజువాక-విశాఖపట్నం), శరగడం పావని(గాజువాక-విశాఖ, నాగుదాసరి రాధాకృష్ణ (పార్వతీపురం-మన్యం) మొదటి పది ర్యాంకులు కైవసం చేసుకున్నారు.

కోటీశ్వరులు... నేరగాళ్లు!

(మూడోపేజీ తరువాయి)

దాడి, హత్య, అత్యాచారం లేదా కిడ్నాప్‌కు సంబంధించిన నేరాలు, మహిళలపై నేరాలు ప్రజాప్రాతినిధ్య చట్టం (సెక్షన్8) లో పేర్కొన్న నేరాలు నివేదికలో తీవ్రమైన నేరాలుగా వర్గీకరించారు.

11 మంది పన్నెండు ఉత్తీర్ణులు... 57 మంది డిగ్రీ లేదా అంతకుమించి

కొత్త మంత్రి మండలిలోని 71 మంది మంత్రుల్లో 11 మంది తమ విద్యార్హత 12వ తరగతి అని ప్రకటించగా, 57 మంది మంత్రులు గ్రాడ్యుయేట్ లేదా అంతకంటే ఎక్కువ విద్యార్హత కలిగి ఉన్నారని ఏడీఆర్ కొత్త నివేదికలో పేర్కొంది. మెజారిటీ మంత్రులు ఉన్నత విద్యను అభ్యసించారు. ప్రత్యేకించి 14 మంది మంత్రులు తమను తాము గ్రాడ్యుయేట్లుగా ప్రకటించుకున్నారు. ప్రాథమిక విశ్వవిద్యాలయ డిగ్రీని కలిగి ఉన్నారు. అదనంగా 10 మంది మంత్రులు వృత్తిపరమైన గ్రాడ్యుయేట్ డిగ్రీలను కలిగి ఉన్నారు. ఇది ఇంజనీరింగ్ లేదా వైద్యం వంటి రంగాలలో ప్రత్యేక విద్యను సూచిస్తుంది. ఉన్నత విద్యావంతులైన మంత్రులలో అతిపెద్ద ఉప సమూహం 26లో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీలు కలిగి ఉన్నారు. ఇంకా, ఏడుగురు మంత్రులు డాక్టరేట్ డిగ్రీలు సంపాదించడం ద్వారా అత్యున్నత స్థాయి విద్యావిషయక స్థాయిని సాధించారు. వీరు కాకుండా డిప్లొమా హోల్డర్లు ముగ్గురు మంత్రులు ఉన్నారు. ఈ మంత్రులు వృత్తి లేదా సాంకేతిక శిక్షణను అందించే ప్రత్యేక కార్యక్రమాలను పూర్తి చేశారు.

ఏడాదికి రెండుసార్లు ప్రవేశాలు

(మూడోపేజీ తరువాయి)

సంవత్సరానికి రెండుసార్లు చేయవచ్చు. గ్రాడ్యుయేట్‌లకు ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తుంది' అని అన్నారు. 'ద్వైవార్షిక అడ్మిషన్లు ఉన్నత విద్యా సంస్థలు (హెచ్ఈఐలు) అధ్యాపకులు, ల్యాబ్‌లు, తరగతి గదులు, సహాయక సేవల వంటి వాటి వనరుల పంపిణీని మరింత సమర్థవంతంగా ప్రణాళిక చేయడానికి కూడా వీలు కల్పిస్తాయని, ఫలితంగా విశ్వవిద్యాలయంలో మెరుగైన కార్యాచరణకు అవకాశం ఉంటుందని యూజీసీ చీఫ్ వివరించారు. 'ప్రపంచవ్యాప్తంగా ఉన్న విశ్వవిద్యాలయాలు ఇప్పటికే ద్వైవార్షిక ప్రవేశాల విధానాన్ని అనుసరిస్తున్నాయి. భారత ఉన్నత విద్యా సంస్థలు ద్వైవార్షిక ప్రవేశాల చక్రాన్ని అవలంభిస్తే, మన ఉన్నత విద్యా సంస్థలు అంతర్జాతీయ సహకారాన్ని, విద్యార్థుల మార్పిడిని మెరుగుపరుస్తాయి. ఫలితంగా మన ప్రపంచ పోటీతత్వం మెరుగుపడుతుంది. మనం ప్రపంచ విద్యా ప్రమాణాలకు అనుగుణంగా ఉంటాము' అని చెప్పారు. 'ఉన్నత విద్యా సంస్థలు ద్వైవార్షిక ప్రవేశాలను అవలంబిస్తే, వారు పరిపాలనాపరమైన చిక్కులపై పని చేయాలి. అందుబాటులో ఉన్న వనరులను పెంచడానికి మంచి ప్రణాళిక, సంవత్సరంలో భిన్నమైన సమయాల్లో ప్రవేశం పొందిన విద్యార్థుల సున్నితమైన మార్పు కోసం అతుకులు లేని మద్దతు వ్యవస్థలను అందించాలి. హెచ్ఈఐలు పరివర్తన కోసం అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులను తగినంతగా సిద్ధం చేసినప్పుడే ద్వైవార్షిక ప్రవేశాల ప్రయోజనాన్ని పెంచుకోవచ్చు' అని అన్నారు. అయితే విశ్వవిద్యాలయాలకు ద్వైవార్షిక ప్రవేశాలు అందించడం తప్పనిసరి కాదని, అవసరమైన మౌలిక సదుపాయాలు, బోధనా అధ్యాపకులు ఉన్న హెచ్ఈఐలు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవచ్చని కుమార్ స్పష్టం చేశారు. ఉన్నత విద్యా సంస్థలు ద్వైవార్షిక ప్రవేశాలను అందించడం తప్పనిసరి కాదని, యూజీసీ వారి విద్యార్థుల చేరికను పెంచడానికి, అభివృద్ధి చెందుతున్న ప్రాంతాలలో కొత్త ప్రోగ్రామ్‌లను అందించాలనుకునే హెచ్ఐఈలకు అందించే సౌలభ్యమని ఆయన తెలిపారు. సంవత్సరానికి రెండుసార్లు విద్యార్థులను చేర్చుకోవడానికి ఉన్నత విద్యా సంస్థలు తప్పనిసరిగా వారి సంస్థాగత నిబంధనలకు తగిన సవరణలు చేయాలన్నారు.

'మోదీ కా పరివార్'కు చెక్

న్యూఢిల్లీ: సోషల్ మీడియా హ్యాండిల్స్ నుంచి 'మోదీ కా పరివార్'ను తొలగించాలని దేశ ప్రజలందరికీ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మంగళవారం విజ్ఞప్తి చేశారు. బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే విజయం సాధించడం ద్వారా సమర్ధవంతంగా సందేశం వెళ్లిందని అన్నారు. ప్రధానమంత్రికి సొంత కుటుంబం లేదంటూ ఆర్జేడీ సుప్రీం లాలూ ప్రసాద్ యాదవ్ గత మార్చిలో సంచలన వ్యాఖ్యలు చేశారు. దీంతో సామాజిక మాధ్యమాల్లో మోదీకి సంఘీభావం వెల్లువెత్తింది. బీజేపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు తమ పేర్లకు ముందు 'మోదీ కుటుంబం' అని రాసుకున్నారు. ఎన్నికలు పూర్తికావడం, మూడోసారి బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే సర్కార్ పదవీ బాధ్యతలు చెప్పడటంతో సోషల్ మీడీయా వేదికల నుంచి 'మోదీ కా పరివార్'ను తొలగించాలని మోదీ విజ్ఞప్తి చేశారు. 'నామీద అభిమానంతో లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో దేశవ్యాప్తంగా ప్రజలు తమ సోషల్ మీడియా ఖాతాలలో 'మోదీ కా పరివార్' అని రాశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.